



epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com




సంపుటి : 18 సంచిక : 9 | 23-02-2026 సోమవారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 12 వెల : రూ.1.00



## బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు అరెస్టు... కిషన్ రెడ్డి ఆగ్రహం

- బాన్సువాడ, కామారెడ్డిలకు వెళ్లేందుకు ప్రయత్నించిన రామచందర్ రావు
- ఉదయం నుంచి హౌస్ అరెస్టు, ఆ తర్వాత అరెస్టు చేసిన పోలీసులు
- రామచందర్ రావు అరెస్టును ఖండించిన కిషన్ రెడ్డి
- కాటిపల్లి వెంకటరమణారెడ్డిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం

2 లో..

తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావును పోలీసులు అరెస్టు చేశారు. కామారెడ్డి, బాన్సువాడలకు వెళ్లేందుకు ఆయన ప్రయత్నించడంతో తార్నాకలోని ఆయన నివాసం వద్ద పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. రామచందర్ రావు నివాసం వద్ద భారీగా పోలీసులను మోహరించారు. రామచందర్ రావును అరెస్టు చేసిన సమయంలో పోలీసులు, బీజేపీ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది.

# దేశంలోనే వేగవంతమైన మెట్రో...



- మీరట్‌లో ప్రారంభించిన ప్రధాని మోదీ
- గంటకు 120 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో ప్రయాణించనున్న మెట్రో
- నమో భారత్ రైలు సేవలను కూడా ప్రారంభించిన ప్రధాని మోదీ

2 లో..



దేశంలోనే అత్యంత వేగవంతమైన మెట్రో సేవలు ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ప్రారంభమయ్యాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ఈ సర్వీసులను లాంఛనంగా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. అనంతరం శతాబ్ది నగర్ స్టేషన్ నుంచి మీరట్ సౌత్ స్టేషన్ వరకు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి మెట్రోలో ప్రయాణించారు. ఈ మెట్రో గంటకు గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది.

## మళ్లీ ఆసుపత్రిలో చేరిన శరద్ పవార్

- అస్వస్థతకు గురి కావడంతో రూబీ హాల్ క్లినిక్ ఆసుపత్రిలో చేరిక
- తన తండ్రి దగ్గు, గొంతు ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్నారన్న కుమార్తె సుప్రియా సూలే



వారం రోజుల క్రితమే ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన శరద్ పవార్ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ ఆదివారం మళ్లీ ఆసుపత్రిలో చేరారు. అస్వస్థతకు గురికావడంతో పూణేలోని రూబీ హాల్ క్లినిక్ ఆసుపత్రిలో చేరారు. తన తండ్రి దగ్గు, గొంతు ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతు న్నారని ఆయన కుమార్తె, బారామతి ఎంపీ సుప్రియా సూలే తెలిపారు. అనారోగ్యం కారణంగా చికిత్స పొంది ఆయన వారం రోజుల క్రితమే ఇంటికి తిరిగి వచ్చారు. శరద్ పవార్ డీహైడ్రేషన్‌తో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. శరద్ పవార్ ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలియాల్సి ఉంది. గత కొన్ని రోజులుగా ఆయన అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు.

## ఆపరేషన్ కగార్‌లో కీలక పరిణామం...

- మావోయిస్టు కీలక నేతలు లొంగుబాటు
- లొంగిపోయిన మావోయిస్టు నాయకులు దేవ్ జీ, మల్లారెడ్డి
- తెలంగాణ ఎస్ఐబీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టులు
- వీరితో పాటు 16 మంది లొంగుబాటు

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్'లో కీలక పరిణామం చోటు చేసుకున్నది. మావోయిస్టు కీలక నేతలు దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి భద్రతా బలగాలకు సరెండర్ అయ్యారు. దేవ్ జీ మావోయిస్టు పార్టీ జనరల్ సెక్రటరీగా ఉండగా, రాజిరెడ్డి పొలిట్ బ్యూరో మెంబర్‌గా ఉన్నారు. రెండు రోజుల్లో వారిని మీడియా ముందు ప్రవేశపెట్టనున్నారు. వీరితో పాటు మరో 16 మంది మావోయిస్టులు లొంగిపోయారు. దేవ్‌జీ అలియాస్ తిరుపతి తెలంగాణ రాష్ట్రంలోని పెద్దపల్లి జిల్లాకు చెందినవాడు. వీరంతా తెలంగాణ ఎస్ఐబీ ఎదుట సరెండర్ అయ్యారు. నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ తర్వాత సెక్రటరీగా దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి మావోయిస్టు పార్టీకి సారథ్యం వహిస్తున్నారు.



## కామారెడ్డిలో అగ్నికి ఆజ్యం పోసింది కాంగ్రెస్సే: బండి



హైదరాబాద్:

తెలంగాణలో రౌడీ రాజ్యం నడుస్తోందని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. ప్రశ్నిస్తే కాంగ్రెస్ నేతలు దాడులు చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ లో ఎమర్జెన్సీ రోజులు ప్రారంభమయ్యాయని, ఎమ్ఐఎమ్, కాంగ్రెస్ కలిసి అరచకాలు సృష్టిస్తున్నాయని విమర్శించారు. ఎమ్ఎల్ ఎ వెంకటరమణా రెడ్డి ఇంటిపై దాడి చేయడం అమానుషం అని.. ఆత్మ రక్షణకు అడ్డుకుంటే దాడి చేశారని చెప్పడం సిగ్గుచేటు అని బండి సంజయ్ మండిపడ్డారు. ఎమ్ఐఎమ్ ను కాపాడడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని, కామారెడ్డిలో అగ్నికి ఆజ్యం పోసింది కాంగ్రెస్సే అని ధ్వజమెత్తారు. బాన్సువాడలో 70 మందిని అరెస్టు చేయడం అక్రమం అని అన్నారు. రాళ్లదాడి స్పష్టంగా కన్పిస్తున్నా చర్యలేవి? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అరాచకాలను అడ్డుకోవడానికి కార్యకర్తలు సిద్ధంకండి అని బండి సంజయ్ పిలుపునిచ్చారు.



## జూబ్లీహిల్స్‌లో బీభత్సం సృష్టించిన స్పోర్ట్స్ కారు

2వ పేజీ

## మూసీ సుందరీకరణపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక్క పాలసీ లేదు: హరీష్ రావు

2వ పేజీ





2 లో..

## నిరసనపై తీవ్రస్థాయిలో స్పందించిన ప్రధాని మోదీ

## జగిత్యాల జిల్లాలో అనుమానాస్పద స్థితిలో కాలువలో శవమై తేలిన బీజేపీ నాయకుడు

2

జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం సుద్దపల్లిలో బీజేపీ నాయకుడు రమణారెడ్డి అనుమానాస్పద స్థితిలో శవమై కనిపించారు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీ మద్దతుతో పోటీ చేసి స్వల్ప ఓట్లతో ఓడిపోయారు. గతంలో ఆయన బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్‌గా పని చేశారు.



# బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు అరెస్టు... కిషన్ రెడ్డి ఆగ్రహం

**బాన్సువాడ, కామారెడ్డిలకు వెళ్లేందుకు ప్రయత్నించిన రామచందర్ రావు**

**ఉదయం నుంచి హౌస్ అరెస్టు, ఆ తర్వాత అరెస్టు చేసిన పోలీసులు**

**రామచందర్ రావు అరెస్టును ఖండించిన కిషన్ రెడ్డి**

**కాటిపల్లి వెంకటరమణారెడ్డిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం**

హైద్రాబాద్ అక్షరకలం ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావును పోలీసులు అరెస్టు చేశారు. కామారెడ్డి, బాన్సువాడలకు వెళ్లేందుకు ఆయన ప్రయత్నించడంతో తార్నాకలోని ఆయన నివాసం వద్ద పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. రామచందర్ రావు నివాసం వద్ద భారీగా పోలీసులను మోహరించారు. రామచందర్ రావును అరెస్టు చేసిన సమయంలో పోలీసులు, బీజేపీ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది.కామారెడ్డి జిల్లా బాన్సువాడలో రెండు వర్గాల మధ్య ఇటీవల ఘర్షణ జరిగిన నేపథ్యంలో అక్కడకు వెళ్లేందుకు రామచందర్ రావు సిద్ధమయ్యారు. అదే సమయంలో కామారెడ్డిలో బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఇంటిపై కాంగ్రెస్ వారు దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ అక్కడకు కూడా వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఉదయం నుంచి రామచందర్ రావును గృహ నిర్బంధం చేసిన పోలీసులు, ఆ తర్వాత అరెస్టు చేశారు.

**రామచందర్ రావు అరెస్టును ఖండించిన కిషన్ రెడ్డి**

రామచందర్ రావు అరెస్టును కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఖండించారు. బాన్సు వాడ, కామారెడ్డిలకు ఆయన వెళ్లకుండా అడ్డుకోవడం దారుణమని అన్నారు. కామారెడ్డిలో ఎమ్మెల్యే ఇంటిపై దాడి జరిగిందని, ఇది ఆందోళనకరమని ఆయన అన్నారు. తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కామారెడ్డిలో గెలిచినందుకు కాటిపల్లి వెంకటరమణారెడ్డిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతీకార రాజకీయాలకు పాల్పడటం సరికాదని అన్నారు.

# నిరసనపై తీవ్రస్థాయిలో స్పందించిన ప్రధాని మోదీ

**ఏఐ సదస్సులో కాంగ్రెస్ నగ్న రాజకీయాలు చేసిందన్న ప్రధాని**

**కాంగ్రెస్ పార్టీ సైద్ధాంతికంగా దివాలా తీసిందని విమర్శ**

**విదేశీ అతిథుల ముందు దేశం పరువు తీశారని ఫైర్**

**కాంగ్రెస్‌ను విమర్శించిన ఇండియా**

**కూటమి భాగస్వాములకు మోదీ ధన్యవాదాలు**

హైద్రాబాద్ అక్షరకలం ప్రతినిధి

ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఢిల్లీలో జరిగిన 'ఇండియా–ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026'లో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చొక్కాలు విప్పి నిరసన తెలపడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. దేశంలోనే అత్యంత పురాతన పార్టీ అయిన కాంగ్రెస్ సైద్ధాంతికంగా దివాలా తీసిందని ఈ ఘటన స్పష్టం చేస్తోందని ఆదివారం మీరట్‌లో జరిగిన ఓ బహిరంగ సభలో విమర్శించారు.కొద్ది రోజుల క్రితం ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన ఈ అంతర్జాతీయ సదస్సులో, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి అంశాలపై యూత్ కాంగ్రెస్ సభ్యులు ప్రధానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈ ఘటనపై మోదీ స్పందిస్తూ, "భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలని ప్రజలు కష్టపడుతుంటే, దేశ ప్రగతిని కొన్ని పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద ఏఐ సదస్సును భారత్ నిర్వహించడం ప్రతి ఒక్కరికీ గర్వకారణం. కానీ కాంగ్రెస్ ఈ ప్రపంచ వేదికను తమ నీచ, నగ్న రాజకీయాలకు వాడుకుంది" అని అన్నారు."విదేశీ అతిథుల ముందు కాంగ్రెస్ నేతలు నగ్నంగా నిలబడ్డారు. అసలు మీ నగ్నత్వం దేశానికి ఇప్పటికే తెలుసు, మళ్లీ కొత్తగా బట్టలు విప్పాల్సిన అవసరం ఏముంది?" అని ప్రధాని ప్రశ్నించారు. సొంత దేశం పరువు తీయడమే కాంగ్రెస్ పనిగా పెట్టుకుందని ఆయన ఆరోపించారు. తనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నేతలు తన సమాధి తవ్వాలని చూడటం, తన తల్లిని దూషించడం వంటివి చేస్తున్నారని, అయితే దేశ ప్రతిష్ఠకు సంబంధి ంచిన కార్యక్రమంలో ఇలా ప్రవర్తించడం హద్దులు మీరడమేనని అన్నారు. దేశం పరువు తీసిన వారిని విమర్శించాల్సింది పోయి, కాంగ్రెస్ అగ్రనేతలు ఆ నిరసనకారులను ప్రశంసించడం దురదృష్టకరమని మోదీ వ్యాఖ్యానించారు. అయితే, ఈ ఘటనపై కాంగ్రెస్‌ను విమర్శించిన ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# జూబ్లీహిల్స్‌లో బీభత్సం సృష్టించిన స్పోర్ట్స్ కారు

**జూబ్లీహిల్స్‌లో అదుపుతప్పిన ఫెరారీ స్పోర్ట్స్ కారు**

**అతివేగంతో ఇతర వాహనాలను ఢీకొట్టి బీభత్సం**

**ప్రమాదంలో పలువురికి తీవ్ర గాయాలు, ఆస్పత్రికి తరలింపు**

**రోడ్ నెం. 45లో భారీగా నిలిచిన ట్రాఫిక్**

**ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలన్న పోలీసుల సూచన**

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఆదివారం ఓ ఫెరారీ స్పోర్ట్స్ కారు బీభత్సం సృష్టించింది. అతివేగంతో ప్రయాణిస్తున్న ఈ కారు రోడ్ నెం. 45లో అదుపుతప్పి పక్క రోడ్లోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో పలు కార్లు, బైక్‌లను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటన సినీ నటుడు నందమూరి బాలకృష్ణ నివాసానికి సమీపంలో చోటుచేసుకుంది. ప్రమాదం ధాటికి వాహనాలు నుజ్జునుజ్జవగా, పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రమా దం కారణంగా రోడ్డుపై వాహనాలు అడ్డదిడ్డంగా పడిపోవడంతో రోడ్ నెం. 45లో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే చర్యలు చేపట్టారు.రోడ్ నెం. 45 నుంచి కేబుల్ బ్రిడ్జి వైపు, అలాగే కేబుల్ బ్రిడ్జి నుంచి రోడ్ నెం. 45 వైపు వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్‌ను మళ్లించారు. వాహనదారులు ఈ మార్గాలను తప్పించి ప్రత్యామ్నాయ రూట్లలో ప్రయాణించాలని పోలీసులు సూచించారు. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# దేశంలోనే వేగవంతమైన మెట్రో...

**మీరట్‌లో ప్రారంభించిన ప్రధాని మోదీ**

**గంటకు 120 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో ప్రయాణించనున్న మెట్రో**

**నమో భారత్ రైలు సేవలను కూడా ప్రారంభించిన ప్రధాని మోదీ**

**పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన ఢిల్లీ–మీరట్ ఆర్ఆర్‌టీఎస్ కారిడార్**






హైద్రాబాద్ అక్షరకలం ప్రతినిధి

దేశంలోనే అత్యంత వేగవంతమైన మెట్రో సేవలు ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ప్రారంభమయ్యాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ఈ సర్వీసులను లాంఛనంగా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. అనంతరం శతాబ్ది నగర్ స్టేషన్ నుంచి మీరట్ సౌత్ స్టేషన్ వరకు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి మెట్రోలో ప్రయాణించారు. ఈ మెట్రో గంటకు గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. ఈ మీరట్ మెట్రో దేశంలోనే అతి వేగవంతమైన మెట్రో వ్యవస్థగా నిలిచింది. మీరట్ మెట్రో సేవలు ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. ఈ ఆధునిక రవాణా వ్యవస్థతో నగరంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గి ప్రజలకు సౌకర్య ం కలుగుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ ప్రాజెక్టులో భా గంగా నమో భారత్ రైలు సేవలను కూడా ప్రధాని ప్రారంభించారు. ఢిల్లీ–మీరట్ మధ్య రీజనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఆర్ఆర్‌టీఎస్) కారిడార్‌పైనే మీరట్ మెట్రో కూడా నడవడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత. దేశంలో ఒకే మౌలిక వసతులపై రెండు వేర్వేరు రైలు సేవలు నడవడం ఇదే తొలిసారి. నమో భారత్ రైలు సాధారణంగా గంటకు 160 కి.మీ., గరిష్ఠంగా 180 కి.మీ. వేగంతో ప్రయాణిస్తుందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా రూ.12,390 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ఆవిష్కరించారు. 82 కిలోమీటర్ల ఢిల్లీ–మీరట్ నమో భారత్ ఆర్ఆర్‌టీఎస్ కారిడార్‌ను పూర్తిస్థాయిలో ప్రారంభించారు. దీంతో ఢిల్లీ, మీరట్ మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది.

# మూసీ సుందరీకరణపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక్క పాలసీ లేదు: హరీష్ రావు

హైదరాబాద్: అక్షరకలం ప్రతినిధి

భూములను కాంగ్రెస్ ప్రభుత్వం గుంజుకుంటోందని బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. కాంగ్రెస్ కు రియల్ ఎస్టేట్ వ్యాపారమే తెలుసు అని అన్నారు. మూసీ నది రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు బాధితుల కుటుంబాలతో హరీష్ రావు సమావేశమయ్యారు. ఇళ్లు కోల్పోయిన బాధిత కుటుంబాల సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ హిల్ట్ పాలసీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుందని విమర్శించారు. హైదరాబాద్ లో ఒక్క ఇళ్లు కట్టినరా? అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మూసీలోకి మురుగు నీరు రాకుండా రూ.3,800 కోట్లతో 38 ఎస్ టిపిలు నిర్మించామని, కాళేశ్వరం ప్రాజెక్టు నుండి గోదావరి నీళ్లను మూసీలో కలిపేందుకు ప్రణాళికలు తయారు చేసామని హరీష్ రావు పేర్కొన్నారు. మీరు దాన్ని కొనసాగించకుండా, మూసీ అభివృద్ధి పేరిట ఇండ్లు కూల్చడం దేనికి? అని ప్రశ్నించారు. నువ్వు కట్టే బాపూ ఘాట్‌ను ఆరాధించే వాళ్ళు ఉండాలి తప్పా.. బాపూ ఘాట్ నిర్మాణం పేరిట బాధితులు ఉండకూడదని సూచించారు. అహింసా వాది మన జాతిపిత మహాత్మ గాంధీ విగ్రహం పెట్టడానికి సిఎం రేవంత్ రెడ్డి హింసా మార్గాన్ని ఎంచుకుంటున్నారని, మధ్యతరగతి వాళ్లకు ఇళ్లు అంటే కలని.. అన్నారు. నీకేంది జూబ్లీహిల్స్ ప్యాలెస్లో బాగానే ఉన్నావు, ఇంకో 100 కోట్లతో ఇంకో ప్యాలెస్ కూడా కట్టుకుంటావని ఎద్దేవా చేశారు. మరి ఈ మధ్య తరగతి ప్రజల పరిస్థితి ఏంటి? అని నిలదీశారు. మూసీ సుందరీకరణపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక పాలసీ లేదని, మూసీ సుందరీకరణను బిఆర్ఎస్ వ్యతిరేకించడం లేదని అన్నారు. మూసీ మురికి పారద్రోలడానికి చర్యలు తీసుకుంటే మద్దతిస్తామని, మూసీ పేరుతో పేదలకు అన్యాయం చేస్తామంటే ఊరుకోమని హెచ్చరించారు. మూసీ బాధితులకు బిఆర్ఎస్ అండగా ఉంటుందని హరీష్ రావు భరోసా ఇచ్చారు.

# జగిత్యాల జిల్లాలో అనుమానాస్పద స్థితిలో కాలువలో శవమై తేలిన బీజేపీ నాయకుడు

**జిల్లాలోని పెగడపల్లి మండలం సుద్దపల్లిలో విషాదం**

**ఇటీవల సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసి స్వల్ప ఓట్లతో ఓడిపోయిన రమణారెడ్డి**

**ప్రమాదమా లేక హత్యనా అనే కోణంలో పోలీసుల దర్యాప్తు**

జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం సుద్దపల్లిలో బీజేపీ నాయకుడు రమణారెడ్డి అనుమానాస్పద స్థితిలో శవమై కనిపించారు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీ మద్దతుతో పోటీ చేసి స్వల్ప ఓట్లతో ఓడిపోయారు. గతంలో ఆయన బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్‌గా పని చేశారు. మూడు రోజుల క్రితం ఆయనకు సంబంధించి పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది.రమణారెడ్డి ప్రయాణిస్తున్న బ్రెజ్జా కారు ఎస్సారెస్పీ కాలువలో పడటంతో ఆయన మృతి చెందాడు. ఆయన ఇటీవల క్రిప్టో కరెన్సీతో భారీగా నష్టపోయాడు. మూడు రోజులుగా ఆయన కనిపించకపో వడంతో మిస్సింగ్ కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో ఆయన కారును ఎస్సారెస్పీ కాలువలో గుర్తించి వెలికి తీయగా అందులో రమణారెడ్డి మృతదేహా న్ని ఉంది. ప్రమాదవశాత్తు కారు అందులో పడిందా లేక ఎవరైనా ఉద్దేశపూర్వ కంగా చేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.ఆయన 18వ తేదీ నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారని, దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు పోలీసులు తెలిపారు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా ఈ ప్రాంతాన్ని దాటి అతను బయటకు వెళ్లినట్లుగా ఎక్కడా లేదన్నారు. దీంతో ఇదే ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టగా ఈరోజు ఉదయం కాలువలో పడినట్లు గుర్తించామని అన్నారు. కారును వెలికితీయగా రమణ మృతదేహం లభ్యమైందన్నారు.

# ఏఐ సదస్సులో ఆ రెండు అవిష్కరణలు ప్రపంచ నేతలను ఆశ్చర్యపరిచాయి: 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ

**ఏఐ సదస్సు ద్వారా అద్భుతమైన సామర్థ్యాలను ప్రపంచానికి చూపించామన్న మోదీ**

**జంతువుల చికిత్సకు, పురాతన గ్రంథాల సంరక్షణ కోసం ఏఐ వినియోగం చూసి ఆశ్చర్యపోయారన్న మోదీ**

**సైబర్ నేరాల పట్ల హెచ్చరిక జారీ చేసిన నరేంద్ర మోదీ**

**10 నెలల చిన్నారి అవయవదానానికి ముందుకు వచ్చిన తల్లిదండ్రులకు ప్రశంసలు**

న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఇటీవల ముగిసిన 'ఏఐ ఇంపాక్ట్' సదస్సుపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. దీని ద్వారా కృత్రిమ మేధ రంగంలో భారతదేశ అద్భుతమైన సామర్థ్యాలను ప్రపంచానికి చూపించామని అన్నారు. ఆదివారం 131వ 'మన్ కీ



బాత్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించిన ఈ సదస్సు ప్రపంచ దేశాలను ఆకర్షించిందని అన్నారు.ఈ సదస్సులో ముఖ్యంగా మన రెండు ఆవిష్కరణలు ప్రపంచ నేతలను ఆశ్చర్యపరిచాయని తెలిపారు. జంతువుల చికిత్సకు వాటిని ట్రాక్ చేయడానికి 'ఏఐ'ని ఉపయోగించడం, భారత పురాతన గ్రంథాలు, జ్ఞానాన్ని సంరక్షించడానికి ఏఐను ఉపయోగించడం చూసి ప్రపంచ నేతలు ప్రశంసించారని అన్నారు. నాయకులు, పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు, స్టార్టప్ రంగాలకు చెందిన వారు ఈ సదస్సుకు హాజరయ్యారని తెలిపారు.కృత్రిమ మేధ, అంతరిక్ష పరిశోధన, సెమీ కండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ సహా అభివృద్ధి చెందుతోన్న సాంకేతిక పరిజ్ఞానాలను వినియోగిస్తూ భారత్ వేగవంతంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. మన యువత ఆవిష్కరణలతో దేశ కీర్తిని ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లే శక్తిని కలిగి ఉందని అన్నారు. ఈ సదస్సు ద్వారా మన యువత ప్రతిభను ప్రపంచానికి చూపించగలిగామని అన్నారు.

## సైబర్ నేరాలపై హెచ్చరిక

సైబర్ నేరాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హెచ్చరించారు. డిజిటల్ అరెస్టుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.కాగా, ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కేరళకు చెందిన 10 నెలల చిన్నారి అలిన్ షెరిన్ అవయవదానానికి ముందుకు వచ్చిన తల్లిదండ్రులను ప్రధాని మోదీ ప్రశంసించారు. బిడ్డను కోల్పోయిన బాధలోనూ వారు తీసుకున్న నిర్ణయం అభినందనీయమని అన్నారు. వారి నిర్ణయం నలుగురికి జీవనదాతగా మారిందని పేర్కొన్నారు.

# ప్రపంచంలో సందర్శించాల్సిన 25 అత్యుత్తమ ప్రదేశాలు ఇవే!

పర్యటనలే మనిషిని పరిపూర్ణుడిని చేస్తాయి. 'ఓ ఏడాది గడిచిపోయే సరికి ఇంతకుముందు చూడని ప్రదేశానికి వెళ్లిరావాలి' అంటారు బౌద్ధ గురువు దలైలామా. ఇంటినుంచి అడుగు బయట పెట్టకపోతే మాత్రం ఉన్నచోటనే ఉండిపోతాం. అదే కొత్త ప్రదేశాలను చుట్టేసి వస్తే కొత్త అనుభూతులు, సరికొత్త అనుభవాలు పోగేసుకుంటాం. మనసు విశాలమవుతుంది. ఇలాంటి దర్శనీయ స్థలాలు ప్రపంచంలో చాలానే ఉంటాయి. వాటిలోంచి ఈ ఏడాది సందర్శించాల్సిన 25 అత్యుత్తమ ప్రదేశాలను సిఫారసు చేస్తున్నారు పర్యాటక నిపుణులు. మనం ఎంచుకునే చోటును బట్టి, మన జీవనశైలిని బట్టి వ్యయాలు మారుతూ ఉంటాయి. శ్రీలంక రాజధాని కొలంబో సమీపంలోని సముద్రతీర నగరం నెగొంబో. బండారనాయకే అంతర్జాతీయ విమానాశ్రయానికి దగ్గర్లోనే ఉంటుంది. సముద్రపు కయ్య (లగూన్)ను అనుసరించుకుని ఉన్న నెగొంబో శ్రీలంకలో పురాతనమైన చేపల పరిశ్రమకు నెలవైన నగరం. ఇక్కడి బీచ్ ప్రశాంతంగా ఉంటుంది.

సముద్రం మీద మత్స్యకారులు చేపల్ని వేటాడే దృశ్యాలు కట్టిపడేస్తాయి. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో సముద్రంలో మునిగిపోయిన బ్రిటిష్ సరుకు రవాణా విమానాన్ని చూడటానికి డైవింగ్ సదుపాయం ఉంటుంది. తీర ప్రాంతంలో మడ అడవులు ప్రత్యేక ఆకర్షణ. వీటిని చూడటానికి పడవ సదుపాయం ఉంది. అలా వెళ్తూ వెళ్తూ నీటి ఉడుములు, వలస పక్షులను చూసి పరవశించిపోవచ్చు. ఇక్కడికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న మున్నేశ్వరం దేవాలయం, స్థానికంగా ఉండే చేపల మార్కెట్ కూడా దర్శనీయమే. ఇక్కడి పెద్దపెద్ద హోటళ్లు విండ్ సర్ఫింగ్, సెయిలింగ్, స్కీయింగ్ సదుపాయాలు కూడా కల్పిస్తుండటం విశేషం.

## కోహ్ కేర్, కాంబోడియా

కాంబోడియా దేశంలోని పవిత్ర నగరం. నాలుగున్నర చదరపు మైళ్ల విస్తీర్ణంలో నెలకొన్న దేవాలయాల సముదాయమే కోహ్ కేర్. ప్రసాత్ థామ్ అనే ఏడంతస్తుల పిరమిడ్ ఇక్కడి ప్రసిద్ధ నిర్మాణం. రకరకాల శిల్పాలు, రాతి చెక్కడాలు, కొలనులు, పురాతన నిర్మాణాలతో పెనవేసుకుని భారీగా పెరిగిపోయిన చెట్లు ప్రధాన ఆకర్షణ. దగ్గరి విమానాశ్రయం సియెమ్ రీప్.

## ముస్తాంగ్, నేపాల్

నేపాల్ హిమాలయ దేశంగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడి ముస్తాంగ్ ప్రాంతం చూపు తిప్పుకోనివ్వని అన్నపూర్ణ, ధవళగిరి హిమగిరులు, పర్వతాల మధ్య మలుపులు తిరుగుతూ లోయల్లో హొయలొలికే నదులు, మంచుకొండల నుంచి నెమ్మదిగా జాలువారుతున్న హిమనదాలు, ఎత్తుపల్లాలతో కూడుకున్న లోయలు, జడలబర్రెలు, గొర్రెలతో ముస్తాంగ్ ప్రాంతం చూడముచ్చటగా ఉంటుంది. మనదేశానికి పొరుగునే ఉండే నేపాల్‌లో పర్యటన సులభమే.

## అల్మాటీ, కజక్‌స్తాన్

మధ్య ఆసియా దేశం కజక్‌స్తాన్‌లో అతిపెద్ద నగరం. పురాతనమైన సిల్క్‌రోడ్‌లో వెలసిన అల్మాటీ కజక్‌స్తాన్‌లో అత్యంత అందమైన నగరం. ట్రాన్స్ ఇలి ఆల్టాయ్ పర్వతాల నేపథ్యంతో ఉండే అల్మాటీ మంచి ప్రణాళికతో, దారికి రెండువైపులా చెట్లతో కూడిన రోడ్లు, లెక్కలేనన్ని పార్కులు, తోటలతో సందర్శకులకు మధురానుభూతులను అందిస్తుంది. ఇక్కడి అసెన్షన్ కేథడ్రెల్ ప్రపంచంలోనే రెండో అత్యంత ఎత్తయిన కొయ్య కట్టడం. దీన్ని 1907లో నిర్మించారు.

## డొమినికా

కరీబియన్ దీవుల్లో కొలువైన 750 చదరపు కిలోమీటర్ల దేశం డొమినికా. అగ్నిపర్వతాలు, ఉష్ణమండల వర్షారణ్యాలు, అంతెత్తునుంచి జాలువారే జలపాతాలు ఇక్కడి ఆకర్షణ. అందుకే దీన్ని 'ప్రకృతి ద్వీపం' (నేచర్ ఐలాండ్) అని పిలుచుకుంటారు. దట్టమైన అడవులు, అందమైన రోజో లోయ, దాదాపు 200 అడుగుల వెడల్పుతో.. పొగలుకక్కుతూ మరిగే నీటి సరస్సు సందర్శనీయ స్థలాలు.

## మసా అండ్ కరారా, ఇటలీ

కళా ప్రేమికులకు స్వర్గధామం ఇటలీలోని మసా అండ్ కరారా ప్రావిన్స్. మన హిమాలయాలను తలపించే అపువన్ ఆల్ప్స్ పర్వతాలు ఇక్కడ ప్రధాన ఆకర్షణ. ప్రపంచ ప్రసిద్ధ పాలరాతి గనులు ఇక్కడే ఉన్నాయి. మైఖేలాంజిలో రూపొందించిన సుప్రసిద్ధ శిల్పం డేవిడ్ ఇక్కడి పాలరాతితో తీర్చిదిద్దిందే. రోడ్డు వారగా శిల్పుల ఉలి సవ్వళ్లు వినిపించడం మసా అండ్ కరారా విలక్షణత. ఆల్ప్స్ పర్వతాలకు తోడు మధ్యధరా సముద్రతీర బీచ్‌లు, భారీతనం ఉట్టిపడే క్రైస్తవ కేథడ్రెల్‌లు, మధ్యయుగాల ఐరోపా చరిత్రను గుర్తుకుతెచ్చే కోటలకు మసా అండ్ కరారా పెట్టింది పేరు.

## లద్దాక్, భారత్

హిమాచల్‌ప్రదేశ్‌లోని రోహ్‌తాంగ్ కనుమ మీదుగా అటల్ టన్నెల్ గుండా సాగిపోతే కేంద్రపాలిత ప్రాంతం లద్దాక్ చేరుకుంటాం. ఆకాశాన్ని అందుకునే హిమాలయాలు, పాతాళాన్ని తాకే పర్వత లోయలు, సింధు, ష్యోక్ నదుల ఒయ్యారపు మలుపులు, బౌద్ధ మఠాలు, జడలబర్రెలు, కొండగొర్రెలు, నల్లమెడ కొంగలు, స్వచ్ఛమైన సరస్సులు లద్దాక్ ఆకర్షణలు. ఇక్కడి పెద్ద పట్టణమైన లేహ్‌లో మార్కెట్లు, మ్యూజియంలు, తొమ్మిది అంతస్తుల రాజభవనం చూడదగిన ప్రదేశాలు.



## బ్రెసీలియా, బ్రెజిల్

దక్షిణ అమెరికా ఖండంలో పెద్దదేశం బ్రెజిల్ రాజధాని నగరం బ్రెసీలియా. ప్రణాళికా బద్ధంగా నిర్మించిన ఈ నగరం అధునాతనమైన తెల్లటి భవంతులకు తార్కాణం. బ్రెజిల్ దేశపు అధ్యక్షుడి నివాసం పలాసియో డ అల్వొరడా కొత్త రూపాన్ని సంతరించుకుని ఈ ఏడాది మళ్లీ ప్రారంభం కానుంది. ఆధునిక నగర ప్రణాళికకు నమూనాగా నిలిచే బ్రెసీలియా నగరానికి యునెస్కో ప్రపంచ వారసత్వ స్థలాల జాబితాలో చోటు దక్కింది.

## యమగూచి, జపాన్

స్వచ్ఛమైన ఉద్యానవనాలు, ఐదు అంతస్తుల రూరికోజీ ఆలయ పగోడాకు ప్రసిద్ధి చెందిన నగరం యమగూచి. వందల ఏండ్ల చరిత్ర కలిగిన బౌద్ధ మందిరం రూరికోజి పగోడాను జపాన్ జాతీయ సంపదల్లో ఒకటిగా పరిగణిస్తారు. ఇక నగరంలోని మలుపులు మలుపుల వీధులు యుద్ధ వ్యూహాన్ని అనుభూతికి తెస్తాయి.

## న్యూజిలాండ్

దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలో ఆస్ట్రేలియాకు దగ్గరగా ఉన్న దేశం న్యూజిలాండ్. ఉత్తర, దక్షిణ న్యూజిలాండ్ ప్రధాన దీవులు కాగా,



చిన్నచిన్న దీవులు అనేకం ఉన్నాయి. క్రియాశీల అగ్నిపర్వతాలు, చూపు తిప్పుకోనివ్వని గుహలు, హిమనదాలతో ఏర్పడిన లోతైన సరస్సులు, అందమైన లోయలు, పొడవైన బీచ్‌లు, మంచుతో కప్పి ఉండే ఎత్తయిన పర్వతాలకు నిలయం ఈ దేశం. కివీ పక్షులు మరో ఆకర్షణ. న్యూజిలాండ్‌ను రోడ్డు ద్వారా వెళ్తూ చూడాలని పర్యాటకులు కోరుకుంటారు. కానీ రైలులో చుట్టేయడం గొప్ప అనుభూతిని ఇస్తుంది. ఇలా న్యూజిలాండ్‌ను తిరగడానికి 17 రోజులు పడుతుంది.

మావుయీ, అమెరికా

అమెరికాకు చెందిన హవాయీ దీవుల్లో భాగమే ఈ మావుయీ ద్వీపం. పసిఫిక్ మహాసముద్రం ఓ వైపు.. కాలుష్యం జాడలు లేని స్వచ్ఛమైన బీచ్‌లు, కొబ్బరిచెట్లు, ఎత్తయిన పర్వతాలతో కూడిన 700 చదరపు కిలోమీటర్ల ద్వీపం ఇది. హాలియాకలా నేషనల్ పార్క్ ప్రత్యేక ఆకర్షణ. ఇక కామావుల్ స్టేట్ బీచ్‌లో ముఖానికి స్నార్కెల్ పెట్టుకొని సముద్ర గర్భాన్ని చూస్తూ ఈదులాడొచ్చు. బీచ్‌లో సేదదీరుతూ సముద్ర తాబేళ్లను చూస్తూ అవ్యక్తమైన ఆనందానుభూతికి లోనుకావొచ్చు.

## మోనార్క్ బటర్‌ఫ్లై బయోస్పియర్ రిజర్వ్, మెక్సికో

ఉత్తర అమెరికా దేశం మెక్సికోలో సుమారు 1,40,000 ఎకరాల్లో విస్తరించిన అటవీ ప్రాంతం.. మోనార్క్ బటర్‌ఫ్లై బయోస్పియర్ రిజర్వ్. శిశిరం వచ్చిందంటే సరి.. బహుదూరాల నుంచి వలసవచ్చిన కోట్లాది మోనార్క్ జాతి సీతాకోకచిలుకలు ఈ పార్కులో సందడిచేస్తాయి. ఈ వలస కాలంలోనే సీతాకోకచిలుకలు నాలుగు తరాలు పుట్టి మరణిస్తాయట. యునెస్కో వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందిన ఈ బయోస్పియర్ రిజర్వ్ మెక్సికో నగరానికి 100 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

## తెస్సాలోనికి, గ్రీస్

గ్రీస్ దేశంలో ఏజియన్ సముద్ర తీరంలో ఉన్న ఈ నగరం పర్యాటక ప్రియులు అత్యధికంగా తరలివచ్చే ప్రదేశాల్లో ఒకటిగా ప్రసిద్ధిచెందింది. క్రీస్తుపూర్వం నాలుగో శతాబ్దంలో 'గ్రీకువీరుడు' అలెగ్జాండర్ ద గ్రేట్ సోదరి తెస్సాలోనికె పేరుమీదుగా ఆమె భర్త కసాండర్ ఆఫ్ మాసిడోన్ స్థాపించాడు. ప్రాచీన గ్రీకుల కాలపు కట్టడాలు, బైజాంటైన్ సామ్రాజ్యం మొజాయిక్ చిత్రాలు, ఒట్టోమాన్ తురుష్కుల కాలపు కట్టడాలతో ప్రాచీన, మధ్యయుగ, ఆధునిక లక్షణాలతో అలరారుతున్న నగరం తెస్సాలోనికి.

## సింగపూర్

ఆసియా ఖండానికి చెందిన నగర దేశం సింగపూర్ నిజంగానే పర్యాటకుల స్వర్గధామం. హిందూ మహాసముద్రం, పసిఫిక్ మహాసముద్రాలను కలిపే మలక్కా జలసంధి ప్రాంతంలో భూమధ్య రేఖ సమీపంలో నెలకొన్న సింగపూర్‌లో%ూ% మెరీనా బే బీచ్ ఇసుకతిన్నెలు, కళ్లు చెదరగొట్టే ఉద్యానవనాలు, కోలాహలంగా ఉండే ఆర్చర్డ్ రోడ్, మండాయ్ అభయారణ్యంలోని పక్షుల పార్కు, పులావు సెంటోసా ద్వీపాలు, సింగపూర్ నేషనల్ మ్యూజియం, ప్రపంచంలోనే అత్యంత అరుదైన మాంగ్రూవ్ అడవులకు నిలయమైన సుంగేయి బులోహ్ వెట్‌లాండ్ అభయారణ్యం ప్రధాన సందర్శన స్థలాలు.

## జెనీవా, స్విట్జర్లాండ్

ప్రకృతి అందాల దేశం స్విట్జర్లాండ్‌లో రెండో పెద్ద నగరం జెనీవా. అనేక అంతర్జాతీయ సంస్థలు ఈ నగరం కేంద్రంగా పనిచేస్తున్నాయి. చాక్లెట్లు, గడియారాలకు జెనీవా ప్రసిద్ధి. ఇక్కడ జెట్ డిఈఎయూ ఫౌంటెయిన్, పూల గడియారం ఎల్‌హార్లోగ్ ఫ్లూరీ, సెయింట్ పియర్ కేథడ్రెల్, ప్లేస్ డ్యు బోర్గ్‌డిఫోర్ తదితర ప్రదేశాలు దర్శనీయాలు. ఇక్కడికి 17 కిలోమీటర్ల దూరంలో ఉన్న సీఈఆర్ఎన్ పరిశోధన కేంద్రం ప్రధాన ఆకర్షణ.

## పారిస్, ఫ్రాన్స్

ఫ్రాన్స్ రాజధాని నగరం పారిస్ ఫ్యాషన్‌కు, ఈఫిల్ టవర్‌కు పేరుగాంచింది. 2024 ఒలింపిక్స్, పారాలింపిక్ ఆటలపోటీలకు ఈ నగరం ఆతిథ్యం ఇస్తున్నది. ఈఫిల్ టవర్‌తోపాటు నోటర్ డామ్ కేథడ్రెల్, లోవర్ మ్యూజియం, ఢిల్లీలోని ఇండియా గేట్‌ను పోలినఆర్క్ ఆఫ్ ట్రయంఫ్, వర్సెయిల్స్ రాజభవనం, డిస్నీలాండ్ చూడదగ్గ స్థలాలు. సీన్ నదిపై నౌకా విహారం అదనపు ఆకర్షణ.

## బ్రూనీ ఐలాండ్, ఆస్ట్రేలియా

ఆస్ట్రేలియా టాస్మేనియా రాష్ట్రంలో పసిఫిక్ మహాసముద్రంలో నెలవైన ద్వీపం బ్రూనీ ఐలాండ్. ఉత్తర, దక్షిణ బ్రూనీ భూభాగాలను కలిపే ఇరుకైన భూసంధి ఇక్కడి ప్రధాన ఆకర్షణ. కుడిఎడమలుగా విస్తరించిన సముద్రం మధ్య రోడ్డు ప్రయాణం ఓ వర్ణించలేని అనుభూతి. ఈ ద్వీపాన్ని మొదటగా 1642లో నెదర్లాండ్స్ నావికుడు ఏబెల్ టాస్మాన్ గుర్తించాడు. గార్డెన్ సీడ్ బ్యాంక్‌లో విత్తనాలు సేకరించవచ్చు. దీనికోసం టాస్మేనియన్ వాకింగ్ కంపెనీ, రాయల్ టాస్మేనియన్ బొటానికల్ గార్డెన్ ఉమ్మడిగా వృక్షశాస్త్ర విజ్ఞానం పెంచుకునేందుకు మూడు రోజుల ట్రెకింగ్ సదుపాయం కల్పించాయి.

## లేక్ టోబా, ఇండోనేషియా

ఇండోనేషియా దేశం సుమత్రాలో 1,707 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో వ్యాపించిన అగ్నిపర్వత సరస్సు లేక్ టోబా. సరస్సు మధ్యలో



పులావు సామోసిర్ ద్వీపం ఉంటుంది. సుమారు 70,000 సంవత్సరాల కింద అగ్నిపర్వత విస్ఫోటనం వల్ల ఈ సరస్సు ఏర్పడింది. పులావు సామోసిర్ బతక్ తెగ ఆదివాసుల సాంస్కృతిక కేంద్రం. కొన్ని రోజులపాటు అడవిలో అలా ప్రశాంతంగా తిరిగి రావాలనుకునే వారికి గొప్ప పర్యాటక ప్రదేశం లేక్ టోబా. అయితే, సరస్సులో నీటి నాణ్యత ఒక్కో దగ్గర ఒకోలా ఉంటుంది. స్థానికులను అడిగి అనువైన చోట మాత్రమే లోపలికి అడుగుపెట్టాలి. ఈ సరస్సులోని నీరు అసహన్ నది గుండా మలక్కా జలసంధిలో కలిసిపోతుంది.

## సావో నేషనల్ పార్క్, కెన్యా

ఆఫ్రికా ఖండ దేశం కెన్యాలో 22,000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించిన అభయారణ్యం సావో నేషనల్ పార్క్. ప్రపంచంలో అతిపెద్ద జాతీయ ఉద్యానవనాల్లో ఇది ఒకటి. ఆఫ్రికా ఏనుగులు, సింహాలు, వివిధ రకాల కోతులు, అడవి దున్నలు, ఖడ్గమృగాలు, నీటి ఏనుగులు, హార్టబీస్ట్ అనే జింకలు, జిరాఫీలు, జీబ్రాలు, వందలాది పక్షిజాతులతో సావో నేషనల్ పార్క్ సందర్శకులకు కనువిందు చేస్తుంది.

## పాసాడెనా, అమెరికా

కాలిఫోర్నియా రాష్ట్రంలో లాస్ ఏంజెల్స్ కౌంటీలో కొలువైన నగరం పాసాడెనా. సెయింట్ గాబ్రియెల్ పర్వతాల నేపథ్యంతో ఈ నగరం చూడముచ్చటగా ఉంటుంది. దీన్ని 1874లో థామస్ బి. ఇలియట్ స్థాపించాడు. పాసాడెనా అంటే 'లోయకు కిరీటం' అని అర్థం. చుట్టుపక్కల ఉన్న జలపాతాలు, ఏంజెలిస్ నేషనల్ పార్కు పాసాడెనాకు ప్రత్యేక ఆకర్షణలు.

## బాజ్ ఎన్‌వావ్‌జో ఇటా కుక్వేని, అమెరికా

అరిజోనా రాష్ట్రంలో భౌగోళిక అద్భుతం గ్రాండ్ కాన్యాన్ పరిసరాల్లో నెలకొంది. దీన్ని గత ఏడాది ఆగస్టులో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ జాతీయ స్మారకంగా ప్రకటించారు. తొమ్మిది లక్షల ఎకరాల్లో విస్తరించిన బాజ్ ఎన్‌వావ్‌జో పీఠభూములు, కాన్యాన్లు, ఇతర భౌగోళిక అద్భుతాలతో వావ్ అనిపిస్తుంది. 3,000 వరకు సాంస్కృతిక, చారిత్రక ప్రాధాన్యం ఉన్న స్థలాలు దీని సొంతం. ఆధ్యాత్మికంగానూ ప్రాధాన్యం కలిగిందే. సిందూరపు రంగు పర్వత భాగాలు, ఇతర వన్యప్రాణులు కనువిందు చేస్తాయి.

## వాలెన్షియా, స్పెయిన్

స్పెయిన్‌లో మధ్యధరా సముద్ర తీరంలో నెలకొన్న నగరం. 2,100 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన నగరం వాలెన్షియా. ద సిటీ ఆఫ్ హండ్రెడ్ బెల్ టవర్స్ అని ఈ నగరానికి మారుపేరు. ఈ స్తంభాలలో మిగులెటె టవర్, టవర్ ఆఫ్ సాంటా కాటలినా ప్రసిద్ధిచెందినవి. నగరం మధ్యలో ఉన్న లా సియో కేథడ్రెల్ కూడా సందర్శనీయ స్థలమే. మధ్యయుగాలకు చెందిన వాలెన్షియా రాజుల కట్టడాలు ఆశ్చర్యపరుస్తాయి. ఎన్నో ఉద్యానవనాలు, ఆర్ట్ మ్యూజియంలు, సిరామిక్స్‌కు వాలెన్షియా పెట్టిందిపేరు. కన్ను ఆకారంలో ఉండే ఎల్‌హెమిస్‌ఫెరిక్, నీళ్లలో ఉండే ఎల్‌ఓషనోగ్రఫిక్ సిటీ కూడా చూడదగినవే. నడుస్తూనే వాలెన్షియాను చుట్టేయవచ్చు.

## సాలార్ డి ఉయుని, బొలీవియా


దక్షిణ అమెరికా దేశమైన బొలీవియాలో ఆండీస్ పర్వతాల్లో 12,000 అడుగుల ఎత్తులో నెలకొన్న ఉప్పు నీటి సరస్సు సాలార్ డి ఉయుని. ఆల్టిట్యూడ్ సిక్‌నెస్‌కు గురయ్యే ప్రమాదం పొంచి ఉన్న సాలార్ డి ఉయునికి ప్రయాణించడం సాహసమే. పురాతన సరస్సులు ఎండిపోవడంతో కేవలం లవణాలు మాత్రమే మిగిలిపోయిన నేల ఇది. 10,000 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించిన తెల్లటి ఉప్పునేల మీద సర్‌సర్‌మని మన అడుగుల సవ్వడి తప్ప మరే శబ్దం వినిపించదు.

## ఔరికా లోయ, మొరాకో

మధ్యధరా, అట్లాంటిక్ మహాసముద్రాల్ని ఆనుకుని ఉన్న మొరాకో దేశంలో అట్లాస్ పర్వతాలు ఉన్నాయి. వీటిలోభాగమే ఔరికా లోయ. ఎత్తయిన అట్లాస్ పర్వతాల మధ్య మలుపులు తిరిగే ఔరికా నది వల్లే ఈ ప్రాంతానికి ఈ పేరు. సెట్టి %-% ఫత్మా అనే గ్రామం దగ్గర్లో.. ఏడు జలపాతాల కలయికగా ఔరికా జలపాతాలు ఉంటాయి. సంప్రదాయ అమాజిగ్ ఇండ్లు కూడా సందర్శనీయ స్థలాలే.

## క్రేటర్స్ ఆఫ్ మూన్, అమెరికా

అమెరికాలోని ఇడాహొ రాష్ట్రంలో అగ్నిపర్వత పేలుళ్లు, లావా ప్రవాహం వల్ల ప్రత్యేకతను సంతరించుకున్న ప్రాంతం. దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో విస్తరించిన క్రేటర్స్ ఆఫ్ మూన్‌ను అమెరికా ప్రభుత్వం 1924లో జాతీయ ప్రాధాన్యంగల ప్రాంతంగా ప్రకటించింది. అగ్నిపర్వత పేలుళ్ల వల్ల ఏర్పడిన ఎగుడు దిగుళ్లతో ఈ ప్రాంతం అచ్చంగా చందమామ ఉపరితలాన్ని గుర్తుకుతెస్తుంది. అందుకే 'క్రేటర్స్ ఆఫ్ మూన్' అని పేరుపెట్టారు. లావా ప్రవాహం గడ్డకట్టి ఉంటుంది కాబట్టి, ఇక్కడ వృక్షాలు అంతగా కనిపించవు. వర్షపాతం కూడా తక్కువే. అయినా, లావాతో గట్టిపడిన పగుళ్లలో నీళ్లు నిల్వ ఉంటాయి. స్నేక్ నది ఈ ప్రాంతం గుండా ప్రవహిస్తుంది.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# నయా నియంతృత్వంలో ట్రంప్

ట్రంప్ కారణంగా ప్రపంచ దేశాలకు పీడతప్పడం లేదు. సుంకాలపై అమెరికా సుప్రంకోర్టు చెంప ఛెళ్లు మనిపించినా తగ్గేది లేదంటున్న ట్రంప్‌తో చిక్కులు, ముప్పు తప్పేలా లేదు. ఎందుకంటే ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయని, సుప్రీం తీర్పును అధ్యయనం చేస్తున్నామని ప్రకటించారు. ఇది ఓ రకంగా అమెరికా పౌరులకే కాకుండా, ప్రపంచ పౌరులకు కూడా అశనిపాతం లాంటిది. ఇంకా చెప్పాలంటే ప్రపంచానికి ట్రంప్ ఇప్పుడు గుదిబండగా మారారు. ఆయన యుద్ధ పిపాస కూడా ప్రపంచ దేశాలకు శాపంగా మారుతోంది. అధికారం లేకున్నా.. అత్యవసర చట్టం కింద అడ్డగోలు సుంకాలు విధిస్తామంటే కుదరదని.. అది రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. సుంకాలు విధించే అధికారం కాంగ్రెస్‌కే ఉంది తప్ప.. రాజ్యాంగ నిర్మాతలు ఆ హక్కును కార్యనిర్వాహక శాఖకు అప్పగించలేదని స్పష్టం చేసింది. ట్రంప్ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని కోర్టు చెబితే.. సర్వోన్నత న్యాయస్థానం తీర్పు అమెరికా ప్రయోజనాలకే విరుద్ధంగా ఉందంటూ ట్రంప్ మండిపడ్డారు! విదేశీ శక్తుల ప్రభావానికి లోనయ్యారంటూ జడ్జిలపైనే ఆరోపణలు చేశారు. వారు అమెరికాకే అవమానకరమని దుయ్యబట్టారు. సుంకాలపై తగ్గేదేలేదని..వాటి స్థానంలో ప్రత్యామ్నాయ మార్గాలను అమలుచేస్తామని తేల్చిచెప్పారు. వేరే చట్టాల కింద..అన్ని దేశాలపైనా 10శాతం ప్రత్యామ్నాయ సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించారు. అంటే కోర్టులన్నా ట్రంప్ లెక్కచేయడం లేదని అర్థం చేసుకోవాలి. ఇది ఓ రకంగా చెప్పాంటే నాజీలను మించిన నియంతృత్వ ధోరణిలో ట్రంప్ ఉన్నారు. నాజీనేత హిట్లర్‌ను మించిన నియంతగా ఇప్పుడు ట్రంప్ అవతరించాడు. ముక్కుపిండి సుంకాలు విధించడం, యుద్ధాలతో బెదరించడం అలావాటు చేసుకున్న ఆధునిక నియంతలా ట్రంప్ మారాడు. ఇది ప్రపంచానికి ఓ హెచ్చరిక కావాలి. 'విమోచన దినం' పేరుతో గత ఏడాది ఏప్రిల్ 2వ తేదీన.. అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం కింద పలు దేశాలపై ఆయన విధించిన భారీ టారిఫ్‌లను కొట్టేస్తూ శుక్రవారం తీర్పు నిచ్చింది. ఆ చట్టం కింద ఇతర దేశాలతో వాణిజ్యాన్ని నియంత్రించే హక్కు మాత్రమే ఉంటుంది తప్ప సుంకాలు విధించే హక్కు ఉండదని తేల్చిచెప్పింది. తన అధికార పరిధిపై ట్రంప్ చేసిన అత్యంత వివాదాస్పద వాదనలను తోసిపుచ్చింది. అమెరికా రాజ్యాంగం ప్రకారం పన్నులు విధించే అధికారం కాంగ్రెస్‌కే ఉంటుందని.. టారిఫ్‌లు కూడా పన్నుల్లో భాగమేనని మెజారిటీ జడ్జిలు స్పష్టం చేశారు. అయితనా జడ్జిల తీర్పును తప్పు పట్టారు. ఇది న్యాయవ్యవస్థ ఉనికికి కూడా సవాల్ లాంటిదే. సుప్రీం తీర్పును కూడా సవాల్ చేసే స్థితికి ఇప్పుడు ట్రంప్ ఎదిగారంటే ఏమవుతుందో అన్న భయం అమెరికన్ల లోనే ఎక్కువగా ఉంది. టారిఫ్‌ల రూపంలో తాము కట్టిన సొమ్మును తిరిగి చెల్లించాలంటూ అతి పెద్ద వేర్‌హౌస్ చైన్ కాస్ట్‌కో సహా పలు కంపెనీలు ఇప్పటికే దిగువ కోర్టులకు క్యూ కట్టిన నేపథ్యంలో.. ఆ పక్రియ సంక్లిష్టంగా ఉండొచ్చని న్యాయమూర్తి బ్రెట్ క్యావనో అభిప్రాయపడ్డారు. అంతేకాదు.. ఆయన తన తీర్పులో భారత్‌పై విధించిన 25శాతం అదనపు సుంకాల గురించి కూడా ప్రస్తావించారు. చైనా, యూకే, జపాన్, ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడానికి అధ్యక్షుడు ఈ సుంకాలను ఒక సాధనంగా ఉపయోగించుకున్నారు. రష్యా నుంచి చమురు కొంటున్న భారత్‌పై అదనంగా 25శాతం సుంకాలను విధించారు. రష్యా చమురు కొనబోమని భారత్ హామీ ఇవ్వడంతో ఆ సుంకాలను తొలగించారని క్యావనో గుర్తుచేశారు. ఇక.. ఈ తీర్పుతో అమెరికా స్టాక్ మార్కెట్ సూచీల్లో పెరుగుదల కనిపించింది. అంటే ఓ రకంగా మార్కెట్లు కూడా సుంకాల బారిన పడి విలవిల్లాడుతున్నాయని గుర్తించాలి. ట్రంప్ విధించిన టారిఫలతో అమెరికా ప్రభుత్వం గత ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబరు 14 దాకా 3,01,000 మందికిపైగా దిగుమతిదారుల నుంచి 133 బిలియన్ డాలర్లు అంటే రూ.12 లక్షల కోట్లు వసూలు చేసింది. ఆ తర్వాత నుంచి ఇప్పటిదాకా వసూలైన మొత్తం కూడా కలిపితే అది 175 బిలియన్ డాలర్ల రూ.16 లక్షలకోట్లకు పైగానే ఉంటుందని అంచనా. ఇవి ఓ దేశ బడ్జెట్‌కన్నా ఎక్కువే. ట్రంప్ ప్రారంభించిన ఈ వాణిజ్య యుద్ధం.. అమెరికా వాణిజ్య భాగస్వాములతో సంబంధాలను దెబ్బతీయడమే కాక, ఆర్థిక మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో తీవ్ర అనిశ్చితికి కారణమైంది. ట్రంప్ టారిఫ్ విధానాలు చట్ట విరుద్ధమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పినట్లైందని కెనడా అభిప్రాయపడింది. తీర్పు ప్రభావాన్ని అధ్యయనం చేస్తున్నామని యూరోపియన్ యూనియన్ తెలిపింది. పరిస్థితులు ఎలా ఉన్నా అమెరికాతో తమ ప్రత్యేక వ్యాపార, వాణిజ్య సంబంధాలు కొనసాగుతాయని బ్రిటన్ తెలిపింది. అమెరికాతో కలిసి పనిచేస్తామంది. ట్రంప్ టారిఫ్‌ల వల్ల



నష్టపోయిన వ్యాపారసంస్థలు, డెమొక్రాట్ల పాలనలో ఉన్న 12 అమెరికా రాష్ట్రాలు కోర్టును ఆశ్రయించాయి. ట్రంప్ తన అధికార పరిధిని మించి ఈ చట్టాన్ని వాడారని, పన్నులు వేసే అధికారం అధ్యక్షుడికి లేదని దిగువ కోర్టు తీర్పు ఇచ్చింది. ట్రంప్ సర్కారు ఆ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయగా.. సుప్రీం కూడా ఆ తీర్పును సమర్థించింది. ఈ తీర్పును వెలువరించిన ధర్మాసనంలో.. ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు నియమించిన ముగ్గురు కన్జర్వేటివ్ జడ్జీలు ఉన్నారు. దీంతో తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వస్తుందని చాలా మంది భావించారు. ట్రంప్ కూడా.. ఇది అమెరికా చరిత్రలోనే అత్యంత ముఖ్యమైన కేసుల్లో ఒకటని.. ఒకవేళ తీర్పు వ్యతిరేకంగా వస్తే అది దేశ ఆర్థిక వ్యవస్థకు గట్టి దెబ్బ అవుతుందని హెచ్చరించారు. అయితే ఈ దశలో ట్రంప్ మొండివైఖరి కారణంగా అమెరికా పెత్తనం చెలాయించాలన్న పట్టుదల కనిపిస్తోంది. ప్రపంచ దేశాలు ఏమైనా తనకు అక్కర్లేదన్న ధోరణి కనిపిస్తోంది.

# ఈనెల 27 న హైదరాబాదులో జరిగే సదస్సు ను విజయవంతం చెయ్యాలని పోస్టర్ల విడుదల

## సీపీఐ (ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ కోల్ బెల్ట్ డివిజనల్ కమిటీ



**మందమర్రి/ చెన్నూరు ఫిబ్రవరి 22 అక్షర కలం ప్రతినిధి:-**

ఈనెల 27 న హైదరాబాదులో జరిగే సదస్సు ను విజయవంతం చెయ్యాలని రామకృష్ణాపూర్ పట్టణం లోని గోదావరిలోయ బొగ్గుగని కార్మిక సంఘం( జి ఎల్ బి కె ఎస్ – ఐఎఫ్టియు) కార్యాలయంలో పోస్టర్లను ఆదివారం విడుదల చేశారు. భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు నిండిన సందర్భంగా ఈ నెల 27 న హైదరాబాద్ లో నీ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సిపిఐ ( ఎం.ఎల్ )న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించడం జరుగుతుందన్నారు. డి. బ్రహ్మానందం సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ కోల్ బెల్ట్ కార్యదర్శి మాట్లాడుతూ.. భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ 1925 లో తన మొదటి మహాసభను జరుపుకొని నేటికి వందేళ్లు పూర్తి అయ్యాయని, దేశాన్ని బ్రిటిష్ వలస పాలకులు ప్యూడల్ ప్రభువులు, సంస్థాన దిశలు, స్థానిక రాజులు, పచ్చి నిరంకుశంగా పాలన సాగిస్తున్నప్పుడు ఈ కమ్యూనిస్టు పార్టీ దేశ ప్రజలకు ఎర్రజెండాగా పరిచయమైంది. దేశానికి బ్రిటిష్ పాలకుల నుండి స్వాతంత్రం, స్వేచ్ఛ, కావాలని నినాదించింది. తదనంతర కాలంలో పార్టీ దున్నేవానికి భూమి అనే విప్లవకర నినాదాలు ఇచ్చింది. సమాజ మౌలిక మార్పులో కీలక అంశంగా ఉన్న భూమి సమస్యను కమ్యూనిస్టు పార్టీ తన ఏజెండాగా చేసుకొని ప్రజలను భూ అక్రమల కోసం పోరాటం లోకి దింపింది, విజయం సాధించింది. ముంబై, కాన్పూర్, మీరట్ లాంటి నగరంలో వెలసిన పారిశ్రామిక కేంద్రాల్లో పనిచేస్తున్న కార్మికుల హక్కుల కోసం కమ్యూనిస్టులు తీవ్రంగా పోరాడారు. యాజమాన్యాల దోపిడీ విధానాలపై కార్మికులు విధుల్లోకి వచ్చారు. కమ్యూనిస్టు పార్టీ కార్మిక వర్గాన్ని కూడగట్టడంతో పాటు కార్మిక సంఘాలనీ ఏర్పాటు చేసుకొని రైతులను సంఘటిత పరిచింది. విద్యార్థులను చైతన్య పరిచేందుకు విద్యార్థి సంఘాన్ని, కవులు కళాకారులను కూడా తీసి సాహిత్య సాంస్కృతిక సంఘాలను ఏర్పాటు చేసింది. దేశంలోనూ జనాభాలోనూ సగభాగమైన మహిళలను ఏకం చేస్తూ మహిళా సంఘం ఏర్పాటు చేసుకున్నది. బ్రిటిష్ వలస పాలకులను దేశం నుండి తరిమేయడానికి కమ్యూనిస్టులు అద్భుతమైన విప్లవ పోరాటాలు సాగించారు. కమ్యూనిస్టు పార్టీ వలసవాద కాలంలోనే బ్రిటిష్ పాలకుల నుండి తీవ్రమైన నిర్బంధాన్ని అణిచివేతను చవిచూసింది. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం మీరాట్, కాన్పూర్ లాంటి కుట్ర కేసులను ఎదుర్కొన్నది. పలువురు కమ్యూనిస్టు నేతలు దేశ బహిష్కరణకు గురయ్యారు. తెలంగాణ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ నిషేధానికి గురి కావాల్సి వచ్చింది. దేశ, ప్రపంచం మెచ్చుకో తగిన భూ పోరాటాలు, కార్మిక వర్గ పోరాటాలు ఆదివాసి పోరాటాలు, రైతాంగ పోరాటాలు, మహిళా పోరాటాలను. సమస్యలను కమ్యూనిస్టు పార్టీ నడిపించింది. దేశ ప్రజల ప్రయోజనాల కోసం నెత్తుటి, త్యాగాలతో పోరాడి గొప్ప కీర్తిని పేరు ప్రఖ్యాతలను సంపాదించుకున్నది. కమ్యూనిస్టు పార్టీ చిహ్నమైన ఎర్రజెండా కష్టజీవుల చేతుల్లో పదునైన ఆయుధంగా మారింది. భూమి పుట్టి దేశ విముక్తి కోసం 1946 నుండి 1951 వరకు తెలంగాణ ప్రాంతంలో క్రూర నిజం నిరంకుశ పాలనకు, వేట్టి చాకిరికి వ్యతిరేకంగా లక్షలాది మనుషులను కదిలించింది. నిజాం సైన్యాలు రజాకార్ల అఘాయిత్యాలు, అత్యాచారాలు దోపిడీని ఎదిరించడం కొరకు గ్రామీణ పేదలకు ఆయుధం ఆయుధాలు ఇచ్చి సాయుధ పోరాటం సాగించింది. పది లక్షల ఎకరాలకు పైగా భూములను పంచిపెట్టి ఆరు వేల గ్రామ స్వరాజ్యాలను నెలకొల్పింది. ఈ మహత్తర చారిత్రాత్మకమైన పోరాటంలో ఐదువేల మందికి పైగా పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు తమ ప్రాణాలను కోల్పోయారు. వేలాది మంది స్త్రీ, పురుషులు, అంతులేని, చిత్రహింసలు, దాడులు, అరాచకాలకు గురయ్యారు. నిజాం సర్కారు నిరంకుశ దోపిడి పాలనకు గోరి కట్టిన ఈ పోరాటం దున్నేవానికే భూమి నినాదాలు ప్రజలకు అందించింది. పేదరికం నిర్మూలన సమాజ వికాసం దేశ అభివృద్ధి భూ సమస్య పరిష్కారంతోనే సాధ్యమని వెలిగేత్తి చాటింది. ఈ విధంగా భారత దేశంలో కమ్యూనిస్టు పార్టీ ముందుకు వెళ్తుంది. ఇలాంటి తరుణంలో వందేళ్ళ సభ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 27న జరగబోతుంది. కనుక విప్లవ సానుభూతిపరులు, మేధావులు, న్యూ డెమోక్రసీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సదస్సు విజయవంతం చేయాలన్నారు.

# సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమం తిరిగి ప్రారంభం

## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**అక్షరకలం నిర్మల్**



కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఈ నెల 23వ తేదీ (సోమవారం) నుంచి యథావిధిగా తిరిగి ప్రారంభమవుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికల ప్రవర్తన నియమావళి ముగిసిన నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని తిరిగి నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన వినతులు, ఫిర్యాదులు సమర్పించదలిచిన వారు ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి హాజరై నేరుగా అధికారులకు తమ దరఖాస్తులను అందజేయవచ్చని పేర్కొన్నారు. జిల్లావాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

# నేడు మోడల్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై అవగాహన సదస్సు

**మందమర్రి, ఫిబ్రవరి 22 అక్షర కలం ప్రతినిధి:**



పట్టణంలోని ప్రభుత్వ పీఎం శ్రీ మోడల్ (ఆదర్శ) పాఠశాలలో హైదరాబాద్ కు చెందిన లీడ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి శిక్షణ సమన్వయకర్త, మోటివేషన్ స్పీకర్ తాడూరి శ్రీనివాస్ ఆచార్య ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై అవగాహన సదస్సును నిర్వహించడం జరుగుతుందని పాఠశాల ప్రిన్సిపల్ సారా తస్మీన్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో కెరీర్ గైడెన్స్ తోపాటు పరీక్షలపైన భయం ఎలా తొలగించుకోవాలి, జూన్ నుండి మార్చి వరకు చదివింది, విన్నది పరీక్షల్లో ఎలా రాయాలి, అనేటువంటి అనేక అంశాలపై మూడు గంటలపాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అదేవిధంగా మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం ఆలోచన విధానాన్ని, ఒక మామూలు మనిషి మహా మనిషి ఎలా అవ్వగలరు, సంపూర్ణ వ్యక్తిత్వ వికాస శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. చాలా అనుభవం ఉన్న లీడ్ ఇండియా ఫౌండేషన్ లోని ఉన్నత వికాసం గల శిక్షకులచే శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# కష్లాపూర్‌లో ఇందిరమ్మ ఇల్లు మార్పిడి కలకలం

**లబ్ధిదారుల ఎంపికపై గ్రామంలో చర్చనీయాంశం**

**గండీడ్, ఫిబ్రవరి 22. అక్షర కలం :**

గండీడ్ మండల పరిధిలోని కష్లాపూర్ గ్రామంలో ఇందిరమ్మ గృహ కేటాయింపుపై వివాదం రేగింది. ఇంతకుముందు ఆమోదం పొందిన లబ్ధిదారురాలు పాల భార్గవి హన్మిరెడ్డి ఇల్లు నిర్మాణం చేపట్టకపోవడంతో ఆ గృహాన్ని రద్దు చేసి, పల్లె మాధవి భర్త తిరుపతిరెడ్డి ఇంటికి మళ్లించినట్లు గ్రామస్థులు తెలిపారు. కొత్త లబ్ధిదారుని ఇంటికి అధికారిక గుర్తింపుగా ముగ్గు వేసి కార్యక్రమం నిర్వహించారు. ఈ మార్పిడి ప్రక్రియ గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. లబ్ధిదారుల ఎంపికలో స్పష్టత,



పారదర్శకత పాటించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ ఎం. ఆశన్న, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కే. అనంతయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఈ. శ్రీనివాస్, పల్లె బిచ్చమ్మ, మేస్త్రి చారీ, ఎం. ఆప్పి తదితరులు పాల్గొన్నారు. ఇందిరమ్మ గృహాల కేటాయింపులో అధికారుల పర్యవేక్షణ మరింత కట్టుదిట్టంగా ఉండాలని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.

# బడ్జెట్లో విద్యారంగానికి కనీసం 20 శాతం నిధులు కేటాయించాలి

## ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్యూ) జిల్లా ప్రధాన కార్యదర్శి డి శ్రీకాంత్ డిమాండ్



**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 22:**

త్వరలో నిర్వహించా శాసనసభ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్ లో విద్యా రంగానికి కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్యూ) జిల్లా ప్రధాన కార్యదర్శి డి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలో ఆదివారం పిడిఎస్యూ ఆధ్వర్యంలో బాలికల విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్య రంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తానని ఎన్నికల ముందు ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చారని, అదేవిధంగా పలు సభలలో సైతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించి, విద్యను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఈ బడ్జెట్ సమావేశాల్లో విద్య రంగాన్ని అధిక నిధులు కేటాయించాలన్నారు. విద్యా రంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని, ఎస్సీ, ఎస్టీ, బిసి హాస్టల్ విద్యార్థులకు సొంత భవనాలు నిర్మించాలని, పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా పిడిఎస్యూ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పి సికిందర్, పట్టణ ఉపాధ్యక్షుడు వంశీ, నాయకులు వైష్ణవి, శివాని, రమ్య, ప్రియాంక, సుష్మ లు పాల్గొన్నారు.

# మారం జగదీశ్వర్ వివాహ వార్షికోత్సవ వేడుకల్లో జిల్లా టిఎన్జీవో నేతలు

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 22:**

టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్ – రమా దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం హైదరాబాద్ వేదికగా ఘనంగా నిర్వహించగా, జిల్లా నుండి టిఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, టీఎన్జీవో జిల్లా నాయకులు హాజరై, ఆదర్శ దంపతులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టిఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి మాట్లాడుతూ, మారం జగదీశ్వర్ – రమా దంపతుల ప్రేమ, గౌరవం, పరస్పర అవగాహనతో సాగుతున్న వారి జీవన ప్రయాణం అనేక మందికి ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. ఈ ప్రత్యేక రోజు వారి బంధం మరింత బలపడాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. రాబోయే వివాహ వార్షికోత్సవాలు మరింత ఆనందం, చిరునవ్వులు, స్వచ్ఛమైన ప్రేమతో నిండాలని కలిసి గడిపే ప్రతి క్షణం మధుర జ్ఞాపకంగా మారాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా మాజీ అధ్యక్షుడు కందుకూరి సురేష్ బాబు, టిఎన్జీవో జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షులు శ్రీపతి బాపురావు, మేనేని సందీప్ లు పాల్గొన్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# ముస్సిపల్ చైర్ పర్సన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బందు శ్రీధర్ బాబు..



**సూర్యాపేట : అక్షర కలం**

సూర్యాపేట మున్సిపల్ ఎన్నికల్లో చైర్పర్సన్ గా ఎన్నికైన మొరిశెట్టి నివేదిత లక్షాది, మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ షఫీ ఉల్లా లను సూర్యాపేట జిల్లా పెరిక సంఘం అధ్యక్షులు బందు శ్రీధర్ బాబుతో పాటు కులస్తులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పెరిక సంఘం జిల్లా అధ్యక్షుడు బందు శ్రీధర్ బాబు మాట్లాడుతూ నూతన మున్సిపల్ చైర్పర్సన్ మొరిశెట్టి లక్షాది, వైస్ చైర్మన్ షఫీ ఉల్లా సారథ్యంలో రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి సహకారంతో సూర్యాపేట మున్సిపాలిటీ అన్ని రంగాల్లో అగ్రగామిగా నిరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పెరిక సంఘం జిల్లా సభ్యులంతా పెద్ద ఎత్తున వచ్చి తమకు శుభాకాంక్షలు తెలిపి అభినందించడం పట్ల చైర్పర్సన్ నివేదిత లక్షాది ఆనందం వ్యక్తం చేశారు.ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయమని ప్రతి వార్డులో ప్రతి సమస్యను పరిష్కరించి ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట మాజీ జిల్లా ఉపాధ్యక్షులు తొగరు మల్లికార్జున్, విద్యాసంస్థల అధినేత కీత యాదగిరి, పట్టణ కోశాధికారి సోమిశెట్టి లింగయ్య, భక్తలాపురం ఉపసర్పంచ్ యర్రంశెట్టి సైదయ్య, జిల్లా కుల సంఘం నాయకులు నెమ్మని నాగేశ్వర్రావు,సుంకరి లింగమూర్తి.బెక్కం వెంకటేశ్వర్లు, ముత్తినేని చంద్రశేఖర్,బాసాని వెంకన్న,నెమ్మని వెంకటేశ్వర్లు, పత్తిపాక వెంకటేశ్వర్లు,దాచేపల్లి సుధాకర్, బుస్సా వీరయ్య,తొగరు కామాంచయ్య,బరిశెట్టి శ్రీనివాస్,సుంకరి రవిబాబు,చందా మల్లికార్జున్,బందు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ నూతన పాలకవర్గం పారిశుద్ధ్య పనులకు శ్రీకారం.

**కోదాడ మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ బాబు**



**కోదాడ : ఫిబ్రవరి 22 (అక్షర కలం)**

పారిశుద్ధ్యంలో కోదాడ పట్టణాన్ని అగ్రస్థానంలో నిలుపుతామని కోదాడ నూతన మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ వెంకట రత్నం బాబు అన్నారు. ఆదివారం పలు వార్డుల్లో పారిశుద్ధ్య పనులను ప్రారంభించి మాట్లాడారు.పట్టణంలో దోమల నివారణకు ట్రాక్టర్ ట్యాంకర్ ల ద్వారా నివారణ మందును పిచికారి చేయించారు. పట్టణ పారిశుధ్యానికి ప్రధాన ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి సహకారంతో పట్టణంలో పారిశుద్ధ్యం తో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. పట్టణ ప్రధాన సమస్యలు డ్రైనేజీలు సిసి రోడ్లు విద్యుత్తు మంచినీరు దోమల ,కుక్కల , కోతుల బెడద నివారణకు చర్యలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు పారిశుధ్యం కి సహకరించాలన్నారు. ఇండ్లలో చెత్తాచెదారం వీధుల్లో వేయకుండా తమ మున్సిపల్ సిబ్బందికి అందించాలన్నారు. ఎక్కడైనా సిబ్బంది గైర్హాజరైతే వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. రానున్న వేసవిలో నీటిని ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో పాలక వర్గ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ శ్రీ శ్రీ మల్లికార్జున స్వామి జాతర మహోత్సవం



**కుత్బుల్లాపూర్ అక్షర కలం**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం పరిధిలోని మెట్టుకానిగూడలో నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ మల్లికార్జున స్వామి జాతర మహోత్సవం భక్తుల సమక్షంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి మరియు నర్సారెడ్డి భూపతి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఆయన అనంతరం స్వామి వారి దర్శనం చేసుకొని, నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు. జాతర సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో హాజరై స్వామి వారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తిశ్రద్ధలతో కొనసాగింది. ఈ కార్యక్రమం లో సీనియర్ కాంగ్రెస్ నాయకుల సభ్యులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ నియోజకవర్గ రాజకీయాల్లో కీలక పరిణామం

**కుత్బుల్లాపూర్ అక్షరకలం**

సీనియర్ నాయకులు మాజీ కార్పొరేటట్ కే ఏం గౌరీష్ బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి ఆధ్వర్యంలో, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సమక్షంలో ఆయనకు పార్టీ కండువా వేసి ఘనంగా ఆహ్వానించారు. ఈ చేరికలో గణేష్ నగర్ డివిజన్ పలు బస్తిలా అధ్యక్షులు చేరారు. అనంతరం హన్మాంత్ రెడ్డి మాట్లాడుతు ఈ చేరికతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు మారే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.ఈ కార్యక్రమం లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## తైక్వాండో బెల్టుల అందజేత



**అక్షర కలం : నకరేకల్ నియోజకవర్గ**

నల్గొండ జిల్లా నార్కట్ పల్లి లో ఉన్న పివిఆర్ చేతన ఉన్నత పాఠశాలలో నల్లగొండ జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో తైక్వాండో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఆదివారం రోజున బెల్టుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నల్గొండ జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెక్రటరీ దగ్గుపాటి విమల హాజరయ్యారు. ఈ తైక్వాండో పోటీలకు ఎగ్జామినర్ గా పట్టేడి సుధాకర్ విద్యార్థుల ప్రతిభను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతిభ ఆధారంగా మొత్తం వివిధ రకాల స్థాయిలో 65 బెల్టులను విద్యార్థులకు అందజేశారు. రెడ్ వన్ 2 , రెడ్ 2, బ్లూ వన్ 4, బ్లూ 5 , గ్రీన్ వన్ 8, గ్రీన్ 5, ఎల్లో వన్ 11, ఎల్లో 28 బెల్ట్ లను వారి ప్రతిభ ఆధారంగా విద్యార్థులకు అందజేశారు. ఈ బెల్టులు సాధించిన విద్యార్థులలో మండలాల వారీగా నార్కట్ పల్లి మండలానికి చెందిన 28, చిట్యాల మండలానికి చెందిన 28, రామన్నపేట మండలానికి చెందిన 9 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ సందర్భంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నల్గొండ జిల్లా అధ్యక్షురాలు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంలో తైక్వాండో ఎంతో ఉపయోగపడుతుందని ప్రభుత్వ కోటాలో రెండు శాతం ఉద్యోగాలు ఈ క్రీడకు అవకాశం ఉంటుందని తెలియజేశారు. అంతేకాకుండా శారీరక మానసిక దృఢత్వం కలుగుతుందని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చేతన స్కూల్ ప్రిన్సిపల్ పుచ్చకాయల వెంకట్ రెడ్డి జవహర్ లాల్, , తైక్వాండో శిక్షకులు గోలి రమేష్, పంతంగి శ్రీకాంత్, పట్టేడ ఫణీంద్ర కుమార్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## పి.ఎం. మాతృ వందన యోజన సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి నర్సింహారావు**

**యాదాద్రి భువనగిరి అక్షర కలం**

యాదాద్రి భువనగిరి జిల్లాలోని గర్భిణీ స్త్రీలు ప్రధాన మంత్రి మాతృ వందన యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి నర్సింహారావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.గర్భిణీ స్త్రీల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి మాతృ వందన యోజన (పీఎంఎంవీవై) పథకం ద్వారా మొత్తం రూ.11,000 వరకు ఆర్థిక సహాయం లభిస్తుందని ఆయన అన్నారు.మొదటి కాన్పుకు రూ.5,000 మూడు విడతల్లో జమౌతుందని ఆయన తెలిపారు. గర్భధారణ రిజిస్ట్రేషన్ తర్వాత రూ.1,000, ఆరవ నెల తర్వాత రూ.2,000, శిశువు తొలి టీకా అనంతరం రూ.2,000 అలాగే రెండో కాన్పుకు అదనంగా రూ.6,000 అందిస్తారని అన్నారు. దరఖాస్తు కోసం అంగన్‌వాడీ కేంద్రంలో ఫారం నింపి ఆధార్, బ్యాంక్ ఖాతా వివరాలు, గర్భధారణ రిపోర్ట్ ను సమర్పించాలని ఆయన తెలిపారు. అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తు చేయవచ్చని ఆయన అన్నారు.

## అనారోగ్యంతో బట్టు శాంతి కుమార్ మృతి

### సంతాపం తెలిపిన పలువురు నాయకులు

**యాదాద్రి భువనగిరి అక్షర కలం**

దళిత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు బట్టు రామచంద్రయ్య పెద్ద కుమారుడు బట్టు శాంతి కుమార్ శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. బట్టు శాంతి కుమార్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. భువనగిరి పట్టణంలోని సంజీవ్ నగర్ లో నివాసం ఉంటున్న శాంతి కుమార్ మృత దేహాన్ని పలువురు రాజకీయ నాయకులు, పాస్టర్లు, సామాజిక కార్యకర్త లు సందర్శించి నివాళులు అర్పించారు.



## చిట్యాల మున్సిపాలిటీలో బాధ్యతలు స్వీకరించిన నూతన పాలకవర్గం

**హాజరైన ఎమ్మెల్యే వేముల వీరేశం, తెలంగాణ డైరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి**



**అక్షర కలం : చిట్యాల**

నల్గొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి నూతన చైర్మన్‌గా పందిరి గీత , వైస్ చైర్మన్‌గా, గుండెబోయిన శ్రీలక్ష్మి మరియు మున్సిపల్ కౌన్సిలర్లు ఆదివారం రోజున బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతి థిగా నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, తెలంగాణ డైలీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి హాజరై అభినందనలు తెలియజేశారు ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పదవి బాధ్యత చేపట్టిన వారిలో కౌన్సిలర్లు సుధాకర్ అలియాస్ కావేరి , షేక్ షబానా, గాలి యాదమ్మ, కోనేటి ఎల్లయ్య, జేరిపోతుల సత్యనారాయణ, దేశపాగలత, కుక్కల మోహన్, ఏర్పుల పరమేష్, నిమ్మనగోటి శ్రీనివాస్, గుబ్బల సందీప ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిట్యాల పట్టణ అభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని తెలిపారు అదేవిధంగా చిట్యాల పట్టణా నికి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసే విధంగా చూస్తామని అన్నారు ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ దండి శ్రీను నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ మహారాజ్ మార్గం ఆదర్శనీయం: ఎమ్మెల్యే బాలు నాయక్



**అక్షరకలం దేవరకొండ**

బంజారాల ఆరాధ్య దైవం సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన సన్మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. ఆదివారం గుర్రగూడలో నిర్వహించిన సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా జరిగిన 'మహాబోగ్' (హోమం) పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే, బంజారా నాయకులతో కలిసి నైవేద్యం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమాజ శ్రేయస్సు కోసం సేవాలాల్ చేసిన కృషిని కొనియాడారు. ఆ మహనీయుని సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బంజారా సంఘాల నాయకులు, మహిళలు మరియు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సీఎం కప్ నెట్ బాల్ లో ఫైనల్లో చేరిన నారాయణపేట బాలుర జట్టు ;

**(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, ఫిబ్రవరి,22)**



స్థానిక మహబూబ్నగర్ స్టేడియం గ్రౌండ్లో ఈనెల 20 నుండి 23 వరకు జరుగుతున్న రెండవరాష్ట్రస్థాయి చీఫ్ మినిస్టర్ ఆఫ్ 2026 నెట్ బాల్ పోటీలలో నారాయణపేట జిల్లా బాలుర జట్టు ఫైనల్ కు చేరుకుందని డివైస్ ఓ. వెంకటేష్ తెలిపారు .ఈ సందర్భంగా అమేచూర్ నారాయణపేట్ నెట్ బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ,శెట్టి రమేష్ కార్యదర్శి డాక్టర్.రామ్మోహన్ గౌడ్ ,సీనియర్ ఉపాధ్యక్షుడు రాజారామ్, ఉపాధ్యక్షులు వెంకటేష్, కనకప్ప, హర్షం వ్యక్తం చేశారు. రేపు జరగబోయే ఫైనల్ లో మంచి ప్రతిభ కనబరిచి మొదటి బహుమతి పొందాలని ఆకాంక్షించారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# యూరియా కొరతపై ఆందోళన అవసరం లేదు

---మండల వ్యవసాయ అధికారి గిరిబాబు

-- రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తామన్న అధికారులు

అక్షరకలం చిట్యాల



నల్గొండ జిల్లా చిట్యాల మండలంలోని రైతులకు యూరియా సరఫరా విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని మండల వ్యవసాయ అధికారి పగిడిమర్రి గిరిబాబు తెలిపారు. శనివారం రోజున వెలిమినేడు గ్రామంలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరిమితి సంఘం కార్యాలయానికి ఆందోళన చేసిన రైతులకు మండల వ్యవసాయ అధికారి గిరిబాబు ఎటువంటి కొరత లేదని తెలిసి చెప్పారు చిట్యాల మండల పరిధిలో ఉన్న వెలిమినేడు, చిట్యాల, గుండ్రంపల్లి ప్రాంతాల్లో ఉన్న మూడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా ఈ సీజన్‌లో ఇప్పటివరకు 900 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందజేసినట్లు వెల్లడించారు. అదనంగా గ్రోమోర్ సెంటర్లు మరియు ప్రైవేట్ డీలర్ల ద్వారా 300 మెట్రిక్ టన్నులు సరఫరా చేసినట్లు చెప్పారు. మండలానికి ఇంకా 300 మెట్రిక్ టన్నుల అవసరం ఉన్నప్పటికీ, 500 మెట్రిక్ టన్నుల వరకు అదనంగా సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. యూరియా అందుబాటులోకి వచ్చిన వెంటనే వాట్సాప్ రైతు గ్రూపుల ద్వారా సమాచారం అందజేస్తామని పేర్కొన్నారు. రైతులు తప్పనిసరిగా “యూరియా యాప్” ద్వారా బుకింగ్ చేసుకుని సంబంధిత డీలర్ల వద్ద నుండి ఎరువును తీసుకోవాలని సూచించారు. ఈ విధానం వల్ల పూర్తి పారదర్శకత ఉండడంతో పాటు ప్రతి బస్తాకు లెక్క ఉండి యూరియా పక్కదారి పడకుండా నివారించవచ్చని తెలిపారు. యాప్ వినియోగంలో ఎలాంటి సందేహాలున్నా వ్యవసాయ విస్తరణ అధికారులు లేదా పిఏసిఎస్ సిబ్బందిని సంప్రదించాలని తెలియజేశారు. ప్రస్తుతం వరి పంట పొట్ట దశలోకి ప్రవేశిస్తున్నందున ఎకరానికి 35 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ కలిపి వేయాలని, అధిక మోతాదులో యూరియా వాడితే పంటకు నష్టం జరుగుతుందని రైతులకు సూచించారు. రైతులు ఆందోళన చెందకుండా యాప్ విధానాన్ని అనుసరించి ఎరువులు కొనుగోలు చేయాలని కోరారు.

## దేవాలయాలకు భూమి పూజ



అక్షర కలం : చిట్యాల

నల్గొండ జిల్లా చిట్యాల మండలంలోని ఉరుమడ్ల గ్రామంలో ముత్యాలమ్మ మరియు మారమ్మ గుడి లకు శంకుస్థాపన కార్యక్రమాన్ని ఆదివారం రోజున నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర డైరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, సీనియర్ నాయకులు గుత్తా దేవేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ భాను శ్రీ బిక్షం ఉపసర్పంచ్ ఉయ్యాల నరేష్ పండితులు అతిథులను పూర్ణకుంభంతో ఆహ్వానించారు అనంతరం వారు దేవాలయాల భూమి పూజ, గణపతి పూజ, హోమం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు. త్వరలోనే గుడి నిర్మాణాలను పూర్తి చేసి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉరుమడ్ల సర్పంచ్ సాగర్ల భాను శ్రీ బిక్షం, ఉప సర్పంచ్ ఉయ్యాల నరేష్, వార్డు సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు పార్టీ నాయకులు భక్తులు వివిధ కులాల సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## సంత్ సేవాలాల్ అడుగుజాడల్లో నడవాలి: రమావత్ రవీంద్ర కుమార్



అక్షరకలం దేవరకొండ

గిరిజనుల ఆరాధ్య దైవం, ఆధ్యాత్మికవేత్త సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని గుర్రంగూడలో ఘనంగా నిర్వహించిన సేవాలాల్ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవీంద్ర కుమార్ మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలోని గత బిఆర్ఎస్ ప్రభుత్వం సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించి గిరిజనుల ఆత్మగౌరవాన్ని చాటిందని గుర్తుచేశారు. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి గిరిజనులకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించిన ఘనత బిఆర్ఎస్‌దేనని కొనియాడారు. హైదరాబాద్ గుండెకాయ వంటి బంజారాహిల్స్‌లో సేవాలాల్ మహారాజ్ పేరుతో భవనాన్ని నిర్మించి, వారి విగ్రహాన్ని ప్రతిష్టించడం గర్వకారణమన్నారు. బంజారాల సంస్కృతిని, ప్రకృతి ఆరాధనను కాపాడటానికి సేవాలాల్ చేసిన కృషి చిరస్మరణీయమని, గిరిజనులంతా ఐకమత్యంతో అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు గిరిజన సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్య సేవలు...

- ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలి...

- కలెక్టర్ రాహుల్ రాజ్.....

మెదక్/ కొల్చారం ఫిబ్రవరి22(అక్షర కలం):-





ఆదివారం కలెక్టర్ వెల్దుర్తి మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు రిజిస్టర్లు పరిశీలించి వైద్య సేవలపై ఆరా తీశారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు చేయించుకునేలా గర్భిణులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. బీపి షుగర్ వ్యాధిగ్రస్తులను గుర్తించి ప్రతి నెలా ఉచితంగా మందులను పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంటాయని వారికి తెలియజేయాలన్నారు వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంటాయని వారికి తెలియజేయాలన్నారు. ఆసుపత్రి ఆవరణను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దేవరకొండలో బీసీ హాస్టల్ విద్యార్థినులకు ఎగ్జామ్ ప్యాడ్ల పంపిణీ

అక్షరకలం దేవరకొండ

పట్టణంలోని బీసీ బాలికల హాస్టల్‌లో ఇంటర్మీడియట్ విద్యార్థినులకు ఆదివారం బీసీ పొలిటికల్ యువజన జేఏసీ ఆధ్వర్యంలో ఎగ్జామ్ ప్యాడ్లను పంపిణీ చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ వడ్త్య దేవేందర్ నాయక్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు చింతపల్లి సతీష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్యాడ్లను అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. బాగా చదివే విద్యార్థులకు పైచదువుల కోసం తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా ఉపాధ్యక్షులు తోటపల్లి మల్లేష్, హాస్టల్ వార్డెన్ రేణుక, నియోజకవర్గ అధ్యక్షులు సత్యం గౌడ్, మండల అధ్యక్షులు బొడ్డుపల్లి సత్యం, పోతురాజు ధనరాజ్ యాదవ్ మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

# 20 సార్లు తప్పించుకున్న మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది.. ఈసారి మాత్రం హతం!

కిష్టవాడ్‌లో భద్రతా బలగాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతం

గతంలో సుమారు 20 సార్లు తప్పించుకున్న జైష్ కమాండర్ సైఫుల్లా వీరిలో ఒకడు

ఆపరేషన్ త్రాషి-1 పేరుతో సంయుక్త దళాలు ఈ ఆపరేషన్ చేపట్టాయి

పాకిస్తాన్ కేంద్రంగా పనిచేసే జైష్-ఎ-మహమ్మద్ సంస్థకు చెందినవారిగా గుర్తింపు

సంఘటనా స్థలం నుంచి రెండు ఏకే-47 రైఫిళ్లు, ఇతర యుద్ధ సామగ్రి స్వాధీనం



జమ్మూ కాశ్మీర్‌లో భద్రతా బలగాలకు పెను సవాల్‌గా మారిన ఓ మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది ఎట్టకేలకు హతమయ్యాడు. గతంలో సుమారు 20 సార్లు భద్రతా దళాల కళ్లుగప్పి, ఎన్‌కౌంటర్ల నుంచి చాకచక్యంగా తప్పించుకున్న పాకిస్థానీ ఉగ్రవాది, జైష్-ఎ-మహమ్మద్ టాప్ కమాండర్ సైఫుల్లాను భద్రతా దళాలు మట్టుబెట్టాయి. కిష్టవాడ్ జిల్లాలో ఆదివారం జరిగిన ఓ భారీ ఎన్‌కౌంటర్‌లో సైఫుల్లాతో పాటు మరో ఇద్దరు ఉగ్రవాదులు కూడా హతమైనట్లు అధికారులు ధృవీకరించారు. ఈ ఘటనతో దోడా-కిష్టవాడ్ ప్రాంతంలో ఉగ్రవాదానికి గట్టి దెబ్బ తగిలినట్లయింది. విశ్వసనీయ సమాచారం మేరకు, జమ్మూ కాశ్మీర్ పోలీసులు, సైన్యానికి చెందిన వైట్ నైట్ కార్ప్స్, సీఆర్పీఎఫ్ దళాలు సంయుక్తంగా ‘ఆపరేషన్ త్రాషి-1’ పేరుతో ఈ ఆపరేషన్ చేపట్టాయి. కిష్టవాడ్ జిల్లాలోని చత్రూ బెల్ట్‌కు చెందిన పాసెర్‌కుట్ ప్రాంతంలో ఓ కొండ దిగువన ఉన్న మట్టి ఇంట్లో ఉగ్రవాదులు నక్కి ఉన్నట్లు నిఘా వర్గాలు పక్కా సమాచారం అందించాయి. దీంతో భద్రతా బలగాలు ఆ ఇంటిని చుట్టుముట్టాయి. దళాలు సమీపిస్తున్నాయని గ్రహించిన ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. ప్రతిగా భద్రతా బలగాలు జరిపిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు అక్కడికక్కడే హతమయ్యారు. హతమైన వారిలో ఒకరిని, గత ఐదేళ్లుగా ఈ ప్రాంతంలో క్రియాశీలంగా ఉంటూ అనేక దాడులకు సూత్రధారిగా వ్యవహరించిన సైఫుల్లాగా ప్రాథమికంగా గుర్తించారు. ఇతడి తలపై ప్రభుత్వం భారీ రివార్డు కూడా ప్రకటించింది. జులై 2024లో నలుగురు సైనికుల మృతికి కారణమైన దాడిలోనూ ఇతడి ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలున్నాయి. తప్పించుకోవడంలో దిట్ట అయిన సైఫుల్లాను మట్టుబెట్టడం భద్రతా దళాలకు అతిపెద్ద విజయంగా భావిస్తున్నారు. సంఘటనా స్థలం నుంచి రెండు ఏకే-47 రైఫిళ్లు, పెద్ద మొత్తంలో మందుగుండు సామగ్రి, ఇతర యుద్ధ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రాంతంలో ఇంకా ఎవరైనా ఉగ్రవాదులు దాక్కుని ఉండవచ్చనే అనుమానంతో భద్రతా బలగాలు గాలింపు చర్యలను కొనసాగిస్తున్నాయి. శాంతికి విఘాతం కలిగించే శక్తులను ఉపేక్షించేది లేదని అధికారులు స్పష్టం చేశారు.

## లడ్డూ వ్యవహారంలో డైవర్షన్ పాలిటిక్స్ కు పాల్పడుతున్నారు: భూమన

లడ్డూ వివాదంలో ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని వైసీపీ ఆరోపణ

ఏకసభ్య కమిటీ వేయడం సుప్రీంకోర్టును అవమానించడమేనన్న భూమన

తప్పుడు ప్రచారాన్ని కప్పిపుచ్చుకునేందుకే ఈ కమిటీ అని విమర్శ


తిరుపతి లడ్డూ వివాదంలో తెలుగుదేశం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తోందని, దారి మళ్లింపు రాజకీయాలకు పాల్పడుతోందని వైసీపీ విమర్శించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అబద్ధాలను, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అవకతవకలను ఎండగట్టడంలో వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేసింది. ఆదివారం నాడు వైసీపీ నేత, టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ.. లడ్డూ అంశంపై ఏకసభ్య కమిటీని నియమించడం సుప్రీంకోర్టును అవమానించడమేనని అన్నారు. “లడ్డూ తయారీకి వాడే నెయ్యిలో జంతు కొవ్వు లేదని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకే సీబీఐ సిట్ బృందం స్పష్టంగా నివేదిక ఇచ్చింది. ఇప్పుడు ఆ నివేదికను ప్రశ్నించేలా కమిటీ వేయడం సర్వోన్నత న్యాయస్థానం గౌరవాన్ని సవాలు చేయడమే” అని ఆయన పేర్కొన్నారు. లడ్డూపై చంద్రబాబు, ఆయన అనుకూల మీడియా చేసిన తప్పుడు ప్రచారాన్ని కప్పిపుచ్చుకునేందుకే ఈ కమిటీని ఏర్పాటు చేశారని భూమన ఆరోపించారు. సిట్ నివేదికతో వారి వాదనలు తప్పని తేలడంతో, ముఖం చాటేసేందుకే ఈ ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ కమిటీ చట్టపరంగా నిలబడదని ఆయన అభిప్రాయపడ్డారు. “ఈ కుంభకోణానికి మూలమైన హెరిటేజ్, ఇందాపూర్, భోలే బాబా డెయిరీల మధ్య ఉన్న సంబంధాలను మేం బయటపెడుతూనే ఉంటాం” అని కరుణాకర్ రెడ్డి స్పష్టం చేశారు. మరోవైపు, పరకామణి చోరీ కేసులో కొత్తగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి, రాజకీయ ప్రత్యర్థులను ఇరికించేందుకు టీటీడీ ప్రయత్నిస్తోందని, ఇది కూడా ప్రజల దృష్టిని మళ్లించే కుట్రలో భాగమేనని ఆయన ఆరోపించారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలకు భయపడబోమని, న్యాయపోరాటం చేస్తామని భూమన తేల్చి చెప్పారు.

## రాజ్యాంగాన్ని ఖూనీ చేసి నిజాం నిరంకుశ పాలన కొనసాగిస్తున్న మంత్రి వివేక్

పత్రిక సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు

చెన్నూరు ఫిబ్రవరి 22 అక్షర కలం ప్రతినిధి:-

చెన్నూరు పట్టణంలోని స్థానిక ప్రెస్ క్లబ్ లో బి ఆర్ ఎస్ నాయకులు ఆదివారం సమావేశం నిర్వహించారు. బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. మంత్రి వివేక్ రాజ్యాంగాన్ని ఖూనీ చేసి నిజాం నిరంకుశ పాలన కొనసాగిస్తున్నారని బిఆర్ఎస్ నాయకులు అన్నారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పై అక్రమ కేసులు బనాయించి పైశాచిక ఆనందం పొందుతున్న మంత్రి వివేక్ కు ప్రజా కోర్టులో శిక్ష తప్పదని, మంత్రి వివేక్ పాలనను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ప్రజల తీర్పును శిరసా వహించి ఖ్యాతనపల్లి మున్సిపాలిటీలో రాజ్యాంగబద్ధంగా చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపిక ప్రక్రియ కొనసాగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి వారు అన్నారు. ఈ సమావేశం లో చెన్నూరు, కోటపల్లి మండలాల బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



అక్షర కలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# అమలుకు నోచుకోని ప్రభుత్వ అధినేతల హామీలు

## పెండింగ్లో సింగరేణి కార్మికుల సమస్యలు

### కాలం వెల్లదీస్తున్న గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు

### ఎస్సీఈయు (సిఐటియు) డిప్యూటీ ప్రధాన కార్యదర్శి అల్లి రాజేందర్

**మందమర్రి, ఫిబ్రవరి 22 అక్షర కలం ప్రతినిధి:**



సింగరేణి కార్మికులకు ప్రభుత్వ అధినేతలైన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క లు ఇచ్చిన హామీలు సింగరేణిలో అమలు కావడం లేదని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) డిప్యూటీ ప్రధాన కార్యదర్శి అల్లి రాజేందర్ ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ, ఇటీవల మున్సిపాలిటీ ఎన్నికల సమయంలో భూపాలపల్లిలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సింగరేణి మెడికల్ బోర్డు యధావిధిగా నడిపిస్తామని చెప్పిన హామీ నేటికీ అమలు కాలేదన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మెడికల్ కార్డు పరిమితి పెంచుతామన్న హామీలు సైతం ఇప్పటికీ అమలు కాలేదని తెలిపారు. శాసనసభ ఎన్నికల సమయంలో కోల్ బెల్ట్ ప్రాంతంలోని కార్మిక సమస్యలను ప్రస్తావిస్తూ, సింగరేణి కార్మికుల సొంతింటి కల, పెర్క్స్ పై ఐటి మాఫీ, మారుపేర్ల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన నేతల మాటలు నేటికీ నీటి మూటలుగానే మిగిలిపోయాయని ఆరోపించారు. సింగరేణిపై ప్రభుత్వ సమీక్షలు సైతం లేవన్నారు. కార్మికుల్లో అసంతృప్తిని సద్దుమణిగించేందుకు ప్రభుత్వ అనుబంధ సంఘమైన ఐఎన్టీయూసీ నాయకులు ప్రభుత్వంలోని మంత్రులకు వినతి పత్రాలు ఇస్తూ, సమస్యలపై సానుకులత వ్యక్తం చేశారని, త్వరలోనే పరిష్కరిస్తామని గత 2 సంవత్సరాలుగా చెబుతూ కాలం గడుపుతున్నారని తెలిపారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ తామేమీ తక్కువ కాదన్నట్లు యాజమాన్యంతో మాట్లాడామని, త్వరలోనే కమిటీలు వేస్తారని చెబుతూ కార్మికులను మోసం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. చివరకు కార్మికులకు కంపెనీ క్యాలెండర్ సైతం ఇప్పించలేని పరిస్థితిలో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు ఉన్నాయని ఎద్దేవా చేశారు. సింగరేణిలో ఉత్పత్తి మాసాల ఇన్సెంటివ్ పోగొట్టారని, మెడికల్ బోర్డుకు రెండు సంవత్సరాల కాల పరిమితికి ముందే అప్లై చేసుకున్న వారు బోర్డుకు పిలవకపోవడంతో దీనంగా ఎదురుచూస్తున్నారన్నారు. మరోవైపు 150 మస్టర్లు లేకుంటే యాజమాన్యం డిస్మిస్లు, ఇంక్రిమెంట్లు కటింగ్ చేస్తున్న ఆపినామని చెప్పిన గుర్తింపు సంఘం మాట్లాడకపోవడం వారి లోపాయికారి ఒప్పందానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఈసారి జరిగే శాసనసభ సమావేశాల్లో కోల్ బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు కార్మిక సమస్యలపై, సంస్థకు రావాల్సిన బకాయిలపై కేవలం చర్చించడమే కాకుండా పరిష్కారం చూపి తమ చిత్తశుద్ధిని చాటుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు లింగాల సత్యనారాయణ, నాయకులు దెబ్బటి శ్రీనివాస్, జడల ప్రవీణ్, నాగవెల్లి శ్రీధర్, పసునూటి శ్రీకాంత్, అలవాల సంజీవ్, జుట్టు అజయ్, చైతన్య రెడ్డి లు పాల్గొన్నారు.

# బుద్ధ వనం సందర్శించిన సౌత్ కొరియా ప్రతినిధులు..



**అక్షర కలం నాగార్జునసాగర్/ నందికొండ**

నాగార్జునసాగర్, ఫిబ్రవరి, 22:అంతర్జాతీయ ప్రమాణాలతో నాగార్జునసాగర్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన బుద్ధవనాన్ని ఆదివారము నాడు సౌత్ కొరియా బుద్ధిష్ట్ స్టడీస్ నేషనల్ యూనివర్సిటీ కి సంబంధించిన ప్రతినిధులు సందర్శించారు. హైదరాబాదులో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పాల్గొన్న వీరు బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య సూచన మేరకు ఆదివారం బుద్ధవనాన్ని సందర్శించారు. సౌత్ కొరియా నేషనల్ యూనివర్సిటీ కి చెందిన విద్యా సాంస్కృతిక ప్రతినిధుల బృందం కాంగ్ సుంగ్ యోంగ్,చోయ్ సేంగహో, మిన్ క్యేయోంగ్ వూ, కవన్ జిన్ వోక్, శేషు, చిరాగ్ జలది తదితరుల బుద్ధవనం సందర్శనలో భాగంగా బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించిన అనంతరం బుద్ధ చరిత వనం, జాతకవనం, ధ్యాన వనం, స్తూప స్తూపవనాలను సందర్శించారు. స్థూప వనములో నిర్మించినటువంటి సౌత్ కొరియా మహాస్తూపాన్ని సందర్శించి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం మహా స్తూపం అంతర్భాగంలోని సమావేశ మందిరంలో బుద్ధవనం విశేషాలను తెలిపే లఘు చిత్రాన్ని వీక్షించారు. మహాస్తూపంలోని ధ్యాన మందిరంలో బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర,బుద్ధవనం ఆర్ట్స్ అండ్ ప్రమోషన్స్ మేనేజర్ శ్యాంసుందర్రావులు వీరిచే బుద్ధ జ్యోతులను వెలిగించి అనంతరం బుద్ధవనం కండువాలతో,బ్రోచర్లతో సత్కరించారు. బుద్ధ వనములో చేపట్టబోయే నూతన నిర్మాణాల గురించి వారికి తెలియజేశారు. వీరితోపాటు స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

# గ్రామీణ, వెనుకబడిన వర్గాల బాలికలకు... నాణ్యమైన విద్యను అందిస్తూ, చదువుకు దూరమైన ఎంతోమంది జీవితాల్లో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు....

### - జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్....

**మెదక్/ కొల్చారం ఫిబ్రవరి22(అక్షర కలం):-**

ఆదివారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కలెక్టర్ వెల్దుర్తి మండలం లో కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను కలెక్టర్ పరిశీలించారు.హాస్టల్లోని నిత్యావసర సరుకులను, స్టోర్ రూంను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందజేయాలని. నిత్యావసర సరకులను సరఫరా చేసే ఏజెన్సీ వారు నాణ్యమైన వస్తువులను మాత్రమే అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.విద్యార్థులకు ఖచ్చితంగా మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని అన్నారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. విద్య బోధన, భోజన సదుపాయం ఇతర మౌలిక వసతులు ఎలా



ఉన్నాయి? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా వచ్చే బోర్డు పరీక్షల దృష్ట్యా విద్యార్థులందరూ 10 జీపీఏ సాధించేందుకు ఉపాధ్యాయులు సమగ్ర వ్యూహాన్ని అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో. కస్తూరిబా గాంధీ విద్యాలయం ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# తమిళనాడు ప్రజలు బీజేపీకి సరైన సమాధానం చెబుతారు: ఉదయనిధి స్టాలిన్

### మోదీ, అమిత్ షాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడిన ఉదయనిధి

### ఎన్నికల్లో బీజేపీ ముఖానికి ప్రజలు నలుపు పూస్తారని వ్యాఖ్య

### స్వార్థ రాజకీయాల కోసం బీజేపీకి అన్నాడీఎంకే అమ్ముడుపోయింది

### మోదీ టీవీలో కనిపిస్తే ప్రజలు భయపడుతున్నారని ఎద్దేవా

### ఈడీకి, మోదీకి తాము భయపడేది లేదని స్పష్టం



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలపై తమిళనాడు ఉప ముఖ్యమంత్రి, డీఎంకే యువజన విభాగం కార్యదర్శి ఉదయనిధి స్టాలిన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి తమిళనాడు ప్రజలు గట్టి గుణపాఠం చెబుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కోయంబత్తూరు జిల్లా కనియూర్లో డీఎంకే యువజన విభాగం పశ్చిమ మండల కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ఆయన, బీజేపీపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. "ఎన్నికల్లో బీజేపీ ముఖానికి తమిళ ప్రజలు నలుపు రంగు పూసి, తగిన రాజకీయ సమాధానం ఇస్తారు" అని ఆయన వ్యాఖ్యానించడంతో పార్టీ కార్యకర్తల నుంచి పెద్ద ఎత్తున హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.ప్రధాని మోదీపై విమర్శలు గుప్పిస్తూ, ఆయన టీవీలో కనిపిస్తే చాలు ప్రజల్లో ఆందోళన మొదలవుతోందని ఉదయనిధి ఎద్దేవా చేశారు. గతంలో ఆకస్మికంగా ప్రకటించిన కరోనా లాక్డౌన్, పెద్ద నోట్ల రద్దు వంటి నిర్ణయాలు దేశవ్యాప్తంగా ప్రజల్లో భయాందోళనలు, తీవ్ర కష్టనష్టాలు సృష్టించాయని గుర్తుచేశారు. "ప్రజలకు ఇచ్చేది డీఎంకే ప్రభుత్వం అయితే, ప్రజల నుంచి డబ్బులు లాక్కునేది బీజేపీ ప్రభుత్వం" అని ఆయన ఆరోపించారు. ఇటీవల కారైకాల్లో పర్యటించిన అమిత్ షాను ఉద్దేశించి, "మీరు ఎన్ని రంగులు పూసుకున్నా, ఎన్నికల్లో తమిళ ప్రజలు మీ ముఖానికి నలుపు పూయడం ఖాయం" అని అన్నారు.కేంద్ర దర్యాప్తు సంస్థలకు, ప్రధాని మోదీకి తాము భయపడబోమని ఉదయనిధి స్టాలిన్ స్పష్టం చేశారు. "మేం ఈడీకి భయపడం, మోదీకి భయపడం. ఎన్నికలను సాకుగా చూపి అభివృద్ధి పథకాలను అడ్డుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది" అని విమర్శించారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఆ పార్టీ స్వాతంత్ర్యాన్ని బీజేపీకి తాకట్టు పెట్టారని ఆరోపించారు. "కొందరు మా ఉద్యమాన్ని నాశనం చేయాలని పగటి కలలు కంటున్నారు. కానీ డీఎంకేను ఎప్పటికీ ఎవరూ కూల్చలేరు" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దేశానికి పాలన, రాజకీయాల్లో తన తండ్రి, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మార్గదర్శకంగా నిలుస్తున్నారని, ఆయన నాయకత్వంలో బీజేపీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య పోరాటం చేయాలని పలు రాష్ట్రాల నేతలు ఆకాంక్షిస్తున్నారని ఉదయనిధి తెలిపారు.రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలపై కూడా ఉదయనిధి విమర్శలు గుప్పించారు. తమిళనాడులో ఎన్ని పోలింగ్ బూత్లు ఉన్నాయో కూడా తెలియకుండా కొందరు సర్వేలు నిర్వహిస్తున్నారని ఎద్దేవా చేశారు.

# యూట్యూబర్ శ్రీనివాస్ హత్య కేసులో బిగ్ ట్విస్ట్..

## స్నేహితుడే సూత్రధారి!

### రచయిత బొగ్గుల శ్రీనివాస్ మృతి కేసును ఛేదించిన పోలీసులు

### ఆర్థిక వివాదాలతో స్నేహితుడే కిరాయి ఇచ్చి హత్య చేయించినట్టు నిర్ధారణ

### ప్రమాదంగా చిత్రీకరించేందుకు మృతదేహంతో కారును పాలేరు జలాశయంలోకి తోసివేత

### ప్రధాన నిందితుడైన స్నేహితుడితో పాటు ముగ్గురు కిరాయి హంతకుల అరెస్ట్

రచయిత, యూట్యూబర్ బొగ్గుల శ్రీనివాస్ మృతి కేసు మిస్టరీని తెలంగాణ పోలీసులు ఛేదించారు. ఆర్థిక లావాదేవీల విషయంలో తేడాలు రావడంతో ఆయన స్నేహితుడే కిరాయి హంతకులతో ఈ దారుణానికి పాల్పడినట్టు తేల్చారు. ప్రమాదంగా చిత్రీకరించేందుకు మృతదేహంతో ఉన్న కారును జలాశయంలోకి తోసేసినట్టు నిర్ధారించారు. ఈ కేసుకు సంబంధించి శ్రీనివాస్ స్నేహితుడితో పాటు మరో ముగ్గురు కిరాయి హంతకులను పోలీసులు అరెస్ట్ చేశారు.వివరాల్లోకి వెళితే, ఖమ్మం జిల్లాలోని పాలేరు జలాశయంలో ఫిబ్రవరి 14న ఓ కారు పడి ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ప్రమాదం జరిగిన సమయంలో డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి బయటకు దూకి పారిపోయినట్టు అక్కడి మత్స్యకారులు తెలిపారు. కారును బయటకు తీసి చూడగా, అందులో శ్రీనివాస్ (48) మృతదేహం లభించింది. ఆయన తలపై గాయాలు ఉండటంతో పోలీ సులు అనుమానించారు. మృతుడు ఆంధ్రప్రదేశ్లోని నంద్యాల జిల్లా అల్లూరు గ్రామ వాసిగా గుర్తించారు. 2014లో 'పవన్ కల్యాణ్ హఠావో-పాలిటిక్స్ బచావో' అనే పుస్తకం ప్రచురించిన తర్వాత శ్రీనివాస్ వార్తల్లోకి ఎక్కారు.శ్రీనివాస్ కుటుంబ సభ్యులు ఇది హత్యేనని అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు ఆ కోణంలో దర్యాప్తు చేపట్టారు. వారం రోజుల్లోనే కేసులో పురోగతి సాధించి, శ్రీనివాస్ స్నేహితుడు వేణుమాధవరెడ్డితో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన పి. కోటేశ్వరరావు, షేక్ అబ్దుల్ హఫీజ్, అజ్మత్ అలీ అనే ముగ్గురు కిరాయి హంతకులను అరెస్ట్ చేశారు.పోలీసుల కథనం ప్రకారం, కొన్ని లావాదేవీల కోసం తన జీఎస్టీ ఖాతాను వాడుకునేందుకు శ్రీనివాస్... మాధవరెడ్డికి అనుమతి ఇచ్చారు. అయితే, జీఎస్టీ బకాయిల విషయంలో అధికారుల నుంచి శ్రీనివాస్కు నోటీసులు రావడంతో, ఒప్పందం ప్రకారం ఆ డబ్బు చెల్లించాలని మాధవరెడ్డిపై శ్రీనివాస్ ఒత్తిడి పెంచారు. దీంతో అతడిని అడ్డు తొలగించుకోవాలని మాధవరెడ్డి నిర్ణయించుకుని, కిరాయి హంతకులను రంగంలోకి దించాడు.విజయవాడ వెళుతున్న శ్రీనివాస్ను నల్గొండ జిల్లా నార్కట్పల్లి వద్ద కారులోనే హత్య చేశారు. ఆ తర్వాత నేరాన్ని కప్పిపుచ్చేందుకు మృతదేహంతో సహా కారును పాలేరు జలాశయంలోకి తోసేసి ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి ఆదివారం మీడియాకు వెల్లడించారు.

# మళ్లీ పెరుగుతున్న కోవిడ్ కేసులు : నలుగురు మృతి



**న్యూఢిల్లీ :**

దేశవ్యాప్తంగా మళ్లీ కోవిడ్ కేసులు పెరుగుతున్నాయి. గడచిన 24 గంటల్లో 752 కొత్త కరోనా కేసులు నమోదయ్యాయి. ఇక శుక్రవారం ఒక్కరోజే కరోనా వల్ల నలుగురు మృతి చెందారు. నిన్నటి కంటే ఈరోజుకి 423 యాక్టివ్ కేసులు పెరిగాయి. కేరళ, కర్ణాటక రాష్ట్రాలలోనే యాక్టివ్ కేసులు పెరిగాయి. కేరళలో 266, కర్ణాటకలో 66 యాక్టివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో శనివారానికి ప్రస్తుతం దేశంలో 3,420 యాక్టివ్ కేసులున్నాయని కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ వెల్లడించింది. కాగా భారత్‌లో జెఎన్.1 సబ్ వేరియంట్ వ్యాప్తి పెరుగుతుండడంతో ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోవాలో ఇప్పటివరకు 21 వేరియంట్ కేసులు నమోదయ్యాయి. ఇక కేరళలో కరోనా కేసులు అత్యధికంగా నమోదవుతున్నాయి. ప్రస్తుతం ఆ రాష్ట్రంలో 2,872 యాక్టివ్ కేసులు ఉన్నాయి. గడచిన 24 గంటల్లో 565 కొత్త కోవిడ్ కేసులు నమోదయ్యాయని ఆరోగ్యశాఖ తెలిపింది.

# నేటి నుంచి నంది నాటకోత్సవాలు

### గుంటూరు విజ్ఞాన మందిరంలో ఏర్పాట్లు

**గుంటూరు జిల్లా ప్రతినిధి :**

రాష్ట్ర స్థాయి నంది నాటకోత్సవాలు శనివారం నుంచి గుంటూరులోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో వారం పాటు జరగనున్నాయి. 73 అవార్డుల కోసం 38 నాటక సమాజాలు 1200 మంది నటీనటులు పోటీపడనున్నారు. ఈ ఉత్సవాలను మంత్రి చెన్నుబోయిన వేణుగోపాలకృష్ణ ప్రారంభించనున్నారు. నాటక ప్రదర్శనలు పరిశీలించి వాటికి స్వర్ణ, రజత, కాంస్య నందుల విజేతలను ఎంపిక చేయడానికి 15 మంది న్యాయ నిర్ణేతలు హాజరుకానున్నారు. శనివారం ఉదయం 11 గం. 'శ్రీ కాళహస్తీశ్వర మహత్యం' (పద్య నాటకం), మధ్యాహ్నం 2.30కు 'ఎర్ర కలువ', సాయంత్రం ఐదుగంటలకు 'నాన్నా%ా% నేనొచ్చేస్తా%ా%', 6 .30కు శ్రీ రామ భక్త తులసీ దాసు (పద్య నాటకం) ప్రదర్శించనున్నారు. కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ టి.విజరు కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లు జరగనున్నాయి. నంది నాటకోత్సవాల సందర్భంగా గుంటూరు కలెక్టరేట్‌లో ఎన్‌టిఆర్ రంగస్థల పురస్కారం, డాక్టర్ వైఎస్‌ఆర్ రంగస్థల పురస్కారానికి విజేతల ఎంపిక కోసం మొత్తం 27 మంది న్యాయనిర్ణేతలు సమావేశమై విజేతలను ఎంపిక చేశారు. ఎన్‌టిఆర్ రంగస్థల అవార్డు 2022 సంవత్సరానికి డా. మీగడ రామలింగ స్వామిని, డా. వైఎస్‌ఆర్ అవార్డు 2023 సంవత్సరానికి కాకినాడ యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ ఎంపిక అయినట్టు ఫిలిం డెవలప్‌మెం ట్ కార్పొరేషన్ చైర్మన్ పోసాని కృష్ణమురళి శుక్రవారం రాత్రి మీడియాకు వెల్లడించారు.

# క్యాబేజీ ఉత్పరివర్తనంలో పరివర్తనమా..!

క్యాబేజీ మొక్క డిఎన్‌ఏలోని ఒక చిన్న భాగాన్ని తొలగించడం ద్వారా తెగుళ్ళు రాకుండా పంట దిగుబడిని పెంచవచ్చని, ఇటీవల పరిశోధకులు వెల్లడించారు. బీజింగ్‌లోని చైనీస్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్‌కు చెందిన స్టేట్ కీ లేబొరేటరీ ఆఫ్ వెజిటబుల్ బయోబ్రీడింగ్ పరిశోధకుల ఫలితం విస్తారమైన పంటకు నాంది పలికింది. ఇప్పుడు మనం చూస్తున్న బిటి విత్తనాల కారణంగా మనకెదురవుతున్న నష్టం వీటి ద్వారా ఉండదని శాస్త్రవేత్తలు హామీ ఇస్తున్నారు. మరి అదేమిటో తెలుసుకుందాం. మన దేశంలో పూర్వం నుంచి సాంప్రదాయ వ్యవసాయం ఆనవాయితీ. అంటే పంట దిగుబడిలోంచి కొన్ని విత్తనాలను మరుసటి సంవత్సరం పంటకోసం దాచుకుని వాడుకోవటమే. కానీ 2002 నుంచి బిటి విత్తనాల ద్వారా అధిక దిగుబడి వస్తుందనే ఆశతో రైతు బిటి విత్తనాలనాశ్రయించడంతో ఇప్పుడు వ్యవసాయమే నిస్సారమైపోయింది. మరి ఇప్పుడు చెప్పేదీ హైబ్రిడు విత్తనాల గురించే కదా.. అంటే ఒక తేడా ఉంది అంటున్నారు నిపుణులు. బిటి విత్తనాలంటే విత్తనం లోపలికి టాక్సిన్ ప్రోటీన్‌ను ఇంజెక్ట్ చేస్తారు. దాంతో పంట తయారైనప్పుడు కీటకాలు వాటిని తినలేవు. అయితే ఇప్పుడు ఈ బయో బ్రీడింగ్‌లో ఎలాంటి టాక్సిన్ మొక్కకు చేరదు. ఒక జన్యుభాగాన్ని తొలగించడం ద్వారా పంట దిగుబడిని పెంచవచ్చునన్నది ఈ ప్రయోగ ఫలితంగా చెబుతున్నారు పరిశోధకులు.



**న్యూక్లియోటైడ్ బేసెస్..**

డిఎన్‌ఏ అణువు రెండు పొడవాటి తంతువులను కలిగి ఉంటుంది. ప్రతి తంతువు న్యూక్లియోటైడ్ బేసెస్ అని పిలువబడే నాలుగు సమ్మేళనాలతో కూడి ఉంటుంది. అవి ఎడినిన్, సైటోసిన్, గ్వానైన్, థైమిన్‌లు. వీటిద్వారా ఏర్పడే రసాయన బంధాలను హైడ్రోజన్ బంధాలు అంటారు. ఎడినిన్, థైమిన్ ఒకతంతువుపై, గ్వానైన్, సైటోసిన్ బేస్‌పెయిర్స్ అంటాము. ఇవి డిఎన్‌ఏ తంతువులను విడిపోకుండా కలిపి ఉంచుతాయి. క్యాబేజీ మొక్క (బ్రాసికా ఒలేరేసియా) జన్యువు 18 క్రోమోజోమ్‌లు, 1.06 బిలియన్ బేస్-జతలను కలిగి ఉంటుంది. ప్రతి కణం ఒక్కొక్కటి రెండు చొప్పున తొమ్మిది జతలను కలిగి ఉంటుంది. రెండు క్రోమోజోమ్‌ల జతల్లో, ఒక క్రోమోజోమ్ పుప్పొడి నుండి వస్తుంది. ప్రతి క్రోమోజోమ్ జతలోని డిఎన్‌ఏ ఒకే విధమైన బేస్-జతల క్రమాన్ని కలిగి ఉంటుంది.

**హైబ్రిడైజేషన్..**

జతలోని క్రోమోజోమ్‌లలో ఒకదానిలో మాత్రమే ఉత్పరివర్తన జన్యువు ఉన్నట్లయితే, మొక్క పుప్పొడిని తయారుచేయదు. రెండు క్రోమోజోమ్‌లలో ఉంటేనే పుప్పొడి తయారై, పరివర్తన చెందుతుంది. అధిక సామర్థ్యం కలిగిన పురుష-స్టెరైల్ ఉత్పరివర్తన జన్యువుల ద్వారా హైబ్రీడ్ విత్తనాలు ఏర్పడతాయి. ఈ ప్రక్రియలో పుప్పొడి తయారయేటప్పుడు ప్రోటీన్ స్థాయి క్రమంగా ఉంటుంది. బేస్-పెయిర్‌ను తొలగించడం ద్వారా క్యాబేజీ పంటలో హైబ్రీడ్ విత్తనాలను ఉత్పత్తి చేయవచ్చు. ఆ తొలగించిన జన్యువు పేరు వీర-షస1. ఈ జన్యువును జొఖీ ప్రోటీన్ బంధిస్తుంది. అలా బంధింపబడిన సమయంలో ప్రోటీన్ తయారు కాకపోయినా, పుప్పొడిని కప్పి ఉంచకపోయినా ఆ జన్యువు సామర్థ్యాన్ని కోల్పోతుంది. అంటే వంధ్యత్వం వస్తుంది. వీర-షస1 ప్రోటీన్ స్థాయి సమతుల్యంగా ఉంటే ఉత్పరివర్తన సక్రమంగా జరిగి పంట దిగుబడి అధికంగా ఉంటుంది. ఇవి సహజ ఫలదీకరణ ద్వారా ఏర్పడిన విత్తనాల కంటే బలమైన మొక్కలను ఉత్పత్తి చేస్తాయి. ఎందుకంటే కృత్రిమ ఫలదీకరణ లేదా హెటిరోసిస్ వలన త్వరగా, బలంగా పెరిగేందుకు కావలసిన పోషకాలు మొక్కకు అందుతాయి. అయితే హైబ్రిడ్ మొక్కలు విత్తనాలనివ్వవు. సహజంగా ఫలదీకరణ చెంది, ఏర్పడిన విత్తనాలే మరల మొలకెత్తుతాయి. కానీ ఈ ఉత్పరివర్తన ద్వారా ఏర్పడిన విత్తనాలు వంధ్యత్వాన్ని పొందకుండా స్థిరంగా ఉంటాయని కొత్త అధ్యయనాలు వివరిస్తున్నాయి. అదే భవిష్యత్తులోనూ కొనసాగితే ఉత్పరివర్తన వంగడాల ద్వారా మంచి దిగుబడి పంటలను ఆశించగలం.

# సైన్స్ వైపు మళ్లిద్దాం..!

సైన్స్ అనేది నిత్యజీవితంలో ఒక భాగం. కానీ అది వాస్తవమని తెలిసినా.. మన ఆలోచనలు మాత్రం అశాస్త్రీయంగానే ఉంటాయి. ప్రతి మనిషి తనకు తెలియకుండానే సైన్సును ఆచరిస్తూనే ఉంటాడు. కానీ ఆ వైపుగానే మనం కొనసాగాలని చెబితే.. అంగీకరించేవారు తక్కువ. సైన్స్ లేనిదే జీవం లేదు. అందుకే ముందు పెద్దవాళ్లుగా మనం ఆ వైపు ఆలోచిస్తూ.. పిల్లల్ని సైన్స్ వైపు మళ్లించడం అవసరం.. ఆవశ్యం..నేడు మన చుట్టూ అనేక అశాస్త్రీయ ఆలోచనలు చుట్టుముట్టి ఉన్న తరుణంలో.. పిల్లల్ని సైన్స్ వైపు అడుగులు వేయించడం అవసరం. అందుకు ముందు పెద్దల ఆలోచనల్లో మార్పు రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. మనం మూఢ నమ్మకాల నుంచి బయటపడకుండా పిల్లల్ని ఆవైపు మళ్లించలేము.



**అపోహలు కల్పించొద్దు..**

లేనివి ఉన్నట్లు.. ఉన్నవి లేనట్లు చెప్పడం అస్సలు చేయకూడదు. పిల్లలకు దెయ్యాల గురించి చిన్నప్పటి నుంచి కథల్లో చెప్తుంటాం. అవి లేవన్న వాస్తవం మనం ముందు అవగాహన చేసుకోవాలి. అలాంటి అభూత కల్పనల్ని వాస్తవమన్నట్లు చిత్రీకరించే భావజాలం పిల్లల్లో కలిగించవద్దు. అవి లేవనీ, కల్పన మాత్రమే అనేది చెప్పాలి. అలా చెప్పక పోతే పిల్లలు రాత్రివేళల్లో భయపడుతుంటారు. ఒంటరిగా బాత్రూమ్‌కి వెళ్లడానికీ వణికిపోతారు. అందులోనూ దెయ్యం అంటే తెల్లని దుస్తుల్లో ఉందని చెప్పడం మరింతగా అపోహలు కలిగించడమే. దీనివల్ల పిల్లలు చీకట్లో ఎవరైనా తెల్లని దుస్తుల్లో వస్తుంటే, దెయ్యమనే భ్రమపడతారు. అందుకే పిల్లలకు ఇలాంటి అపోహలు కల్పించవద్దు.

**అసత్యాలు చెప్పకండి..**

పిల్లలకు పిల్లి ఎదురైతే కీడు జరుగుతుందని, ఎవరైనా తుమ్మితే వెళ్లడం ఆగిపోవాలని.. అలా చేయకపోతే వెళ్లే పని అవ్వదని చెప్పడం సరికాదు. పిల్లిని చూడటానికి కీడు జరగడానికి ఎలాంటి సంబంధం లేదు. అలాంటి అసత్యాలు పిల్లలకు చెబితే పనులపై అలసత్వం ఏర్పడుతుంది. అలాగే తుమ్ము రావడానికి మనం వెళ్లేదానికీ పొంతనే లేదు. సమయానికి వెళ్లకపోతే పనులు జరగకపోవడం ఖాయం. అంతేగానీ తుమ్ములతో కూర్చుంటే అసలుకే పనికాదు. ఇలాంటివి పిల్లలకు చిన్నప్పటి నుంచి చెప్పడం వల్ల మూఢనమ్మకాలను నేర్పించినవారమవుతాం. గ్రహణాల గురించి కూడా పెద్దలం చాలా అపోహలకు లోనవుతుంటాం. అవే పిల్లలకు నేర్పిస్తూ ఉంటాం. ఇందులో సైన్స్ తెలుసుకుని, పిల్లలకు చెప్పండి.

**వక్రీకరణలు ఆపండి..**

పిల్లలకు ఈ రోజుల్లో మూరు?లు చెప్పే మాటల్ని పట్టుకుని వక్రీకరణలు వాస్తవంగా చెప్పకండి. అవి పక్కా వక్రీకరణలే. ప్లాస్టిక్ సర్జరీ పురాణకాలంలోనే జరిగిందనీ, విమానాలు కూడా అప్పుడే కనిపెట్టారనే మాటలన్నీ బూటకాలే. ప్రజల్ని పక్కదారి పట్టించేవిలాంటి అభూతకల్పనలను మీరూ నమ్మకండి.. పిల్లలకీ చెప్పకండి.. ఇలాంటి వక్రీకరణలను ఎండగట్టాలి.

**ప్రయోగాలకు నిలబడాలి..**

ఏదైనా ప్రయోగాలకు నిలబడాలి. నిరూపితం కానివి అబద్ధాలే. అందుకే మీరు నిర్ధారణకు రావాలన్నా.. ఎవరేమి చెప్పినా ప్రయోగానికి నిలిస్తేనే నమ్మండి. అదే విషయం పిల్లలకూ చెప్పండి. ఏదైనా చెప్పినప్పుడు అది ఎలాగో నిరూపించమని నిలదీయాలి. సైన్స్ ఎప్పుడూ పరిశోధనలతో తేటతెల్లం చేసినవే చెప్తుంది. భూమి ఏర్పడిన దగ్గర నుంచి.. ఆకాశం, నీరు అన్నీ మీకు తెలియకపోతే తెలియదని చెప్పండి. అంతేగానీ.. లేనిపోనివి కల్పించి చెప్పకండి. వర్షం ఎందుకు? ఎలా? ఎక్కడ నుంచి అంటే.. చాలామంది తల్లిదండ్రులు దేవుడు స్నానం చేస్తున్నాడనీ, మూత్రం పోసుకుంటున్నాడనీ కథలు చెప్తుంటారు. కానీ వర్షం ఎలా? ఎందుకు? ఎక్కడ నుంచి పడుతుందో తెలిసినా చెప్పరు. ఇదే పిల్లల్ని మూరు?లుగా, తెలియనివారిగా తయారుచేస్తుంది. మనిషి పుట్టుక కూడా ఎలా జరిగిందో మనకు తెలుసు. కానీ ఆ జీవ పరిణామక్రమాన్ని మాత్రం పిల్లలకు చెప్పం. దీనివల్ల పిల్లలు సైన్సు కన్నా.. ఇలాంటి అపోహల్నే నమ్ముతూ ఎదుగుతారు. కొందరు పిల్లల్ని చిన్నప్పటి నుంచి ప్రశ్నిస్తుంటారు. మన దగ్గర సరైన సమాధానం లేనప్పుడు.. వాళ్లను నోరుమూయిస్తుంటాం. అది సరికాదు. తెలియంది తెలుసుకుని చెప్పండి. తెలియకపోతే అది పిల్లల వద్ద ఒప్పుకోండి. అంతేగానీ.. విసుక్కుని వాళ్ల జిజ్ఞాసను అణచివేయొద్దు. శాస్త్రీయంగా ఆలోచిస్తేనే మానవుడు మొన్న చంద్రయాన్-3 వరకూ ఎదిగాడు. అంతరిక్షంలోకి వెళ్లగలిగాడు. ఈ రోజు మనమంతా ఇలా ఉన్నామంటే సైన్స్ వల్లే. ఎలాంటి రోగాలకైనా మందులు కనిపెట్టగలుగుతున్నారంటే సైన్స్ కారణం.

# కళ్లకు గంతలతో సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగుల నిరసన



**మన్యం :**

రాష్ట్రవ్యాప్తంగా సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు చేస్తున్న సమ్మె శనివారంతో నాలుగో రోజుకు చేరింది. ప్రతిపక్ష హోదాలో పాదయాత్ర సందర్భంగా %ా% జగన్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు అందర్నీ రెగ్యులర్ చేస్తానన్న హామీని అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, 4 నెలల పెండింగ్ వేతనాలు తక్షణం చెల్లించాలని, పీఎఫ్, ఈ.ఎస్.ఐ అమలుచేయాలని ఉద్యోగులంతా నినాదాలు చేశారు. మన్యంలో సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులంతా నల్లటి రిబ్బన్లతో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు.

# 12వ రోజు కొనసాగుతోన్న అంగన్వాడీల నిరవధిక సమ్మె

**అమరావతి :**

తమ సమస్యలను పరిష్కరించాలంటూ అంగన్వాడీలు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరవధిక సమ్మె శనివారంతో 12వ రోజుకు చేరుకుంది. కనీస వేతనం అమలు చేయాలని, అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే కార్యక్రమాన్ని వివిధ రూపాలలో ఉద్రిక్త చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. చెవిలో పూలు పెట్టుకొని పలుచోట్ల ధర్నా నిర్వహించారు.



# పాలమూరులో బీజేపీ 'ప్రతిక్షణం మహా అభియాన్--2026'కు శ్రీకారం

## రాష్ట్ర ఆదేశాల మేరకు గ్రామం నుంచి జిల్లా దాకా కార్యాచరణకు రూపురేఖలు







**మహబూబ్ నగర్. ఫిబ్రవరి 22. అక్షర కలం :**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకత్వం సూచనల మేరకు 'ప్రతిక్షణం మహా అభియాన్--2026' కార్యక్రమాన్ని పాలమూరు బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి జిల్లా, మండల, గ్రామ స్థాయి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రాష్ట్ర బృందం తరఫున ముఖ్య నాయకుడిగా పాల్గొన్న శ్రీనివాస్ రెడ్డి పార్టీ బలోపేతానికి అనుసరించాల్సిన కార్యాచరణపై విస్తృతంగా మార్గదర్శనం చేశారు. గ్రామ స్థాయి బూత్ కమిటీలను చురుకుగా మార్చి ప్రతి ఇంటికీ పార్టీ సిద్ధాంతాలు చేరేలా కృషి చేయాలని సూచించారు. మండల, జిల్లా స్థాయిల్లో సమన్వయాన్ని పెంపొందిస్తూ క్రమబద్ధమైన కార్యక్రమాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త పార్టీకి అంబాసిడర్‌లా వ్యవహరించాలని, ప్రజల సమస్యలపై స్పందిస్తూ ప్రభుత్వ వైఫల్యాలను వెలుగులోకి తీసుకురావాలని అన్నారు. రాబోయే రాజకీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతిక్షణం పార్టీ కార్యక్రమాలు అమలు చేయాలని స్పష్టం చేశారు. సంస్థాగత బలం పెరిగితేనే విజయాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. సమావేశం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగగా, కార్యకర్తలు పార్టీ లక్ష్య సాధనకు అంకితభావంతో పనిచేస్తామని సంకల్పం వ్యక్తం చేశారు. జిల్లాలో ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఎగరవేయాలని, బలమైన వ్యవస్థను నిర్మించాలని నిర్ణయించారు.

# ఒకటవ క్రీడల కోసం అర్హత సాధించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

**అక్షర కలం /భద్రాచలం**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల భద్రాచలం విద్యార్థులు ఇర్పా.ఆనంద్, కొమరం అశ్విత్ దొర తెలంగాణ పురుషుల విలువిద్య జట్టు.కేలో ఇండియన్ ట్రైబల్ గేమ్స్ ఫేజ్ రెండుపోటీలలో ఢిల్లీలోని యమునా స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద జరిగిన జట్టు ఎలిమినేషన్ రౌండ్‌లో నాలుగో వ స్థానం సాధించి, ఛత్తీస్‌గఢ్‌లో జరగనున్న ఫేజ్ ఒక్కటి క్రీడల కోసం అర్హత సాధించిందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జాన్ మిల్టన్ అన్నారుఆదివారం నాడు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇర్పా ఆనంద్, కొమరం అశ్విత్ దొర, తెలంగాణ పురుషుల విలువిద్య జట్టు కేలో ఇండియన్ ట్రైబల్ గేమ్స్ పేజ్ రెండు పోటీలలో న్యూఢిల్లీలోని యమునా స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద జరిగిన జట్టు ఎలిమినేషన్ రౌండ్ లో నాలుగో స్థానం సాధించి ఛత్తీస్గఢ్ లో జరుగనున్న పేజ్ ఒక్క క్రీడల కోసం అర్హత సాధించినందుకు వారిని ప్రత్యేక అభినందించి,ఈ టీమ్ కు కోచ్ గా కళాశాల పూర్వ విద్యార్థి కళ్యాణ్ శిక్షణ అందిస్తున్నారని ఆయన తెలుపుతూ ఇన్చార్జి పిడి డాక్టర్ ఎం కిరణ్ కుమార్ విద్యార్థులను అభినందిస్తూ పట్టుదలతో మరిన్ని విజయాలు సాధించాలని, అందుకు కళాశాల ఎల్లప్పుడు సహకారం అందిస్తుందని ఆయన అన్నారు




# పాలమాకుల గ్రామంలో శ్రీ కృష్ణ విగ్రహ ప్రతిష్టా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

## భవిష్యత్‌లో పాలమాకుల గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసుకుందాం

**అక్షర కలం సిద్దిపేట ఫిబ్రవరి 22:**





నంగునూర్ మండలం పాలమాకుల గ్రామం లో జరుగుతున్న శ్రీ కృష్ణ విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం లో పాల్గొన్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ఈ సందర్భంగా మాట్లాడుతు శ్రీ కృష్ణ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం అద్భుతం గా జరిగింది.యాదవుల కుల దైవం గా శ్రీ కృష్ణున్ని కొలుస్తారు.గ్రామం లో శ్రీ కృష్ణ స్వామి ప్రతిష్ట జరగడం చాలా సంతోషం గా ఉంది. పాలమాకుల గ్రామం లో అందరు కలసి మెల్సి ఉండాలి.ఐక్యత తో అభివృద్ధి లో ఆదర్శంగా నిలుపుకోవాలన్నారు.ఎంతో ఐక్యత తో ఉన్న గ్రామం అదే ఐక్యత తో ఉండాలన్నారు.గ్రామం లోని ఊర చెరువు కు కాళేశ్వరం నీళ్లు నింపుతున్నాం.నిండు కుండల ఊర చెరువు నీళ్లతో కళకళ లాడుతుందని చెప్పారు. గ్రామం లో 100% సిసి రోడ్లు పూర్తి చేసుకున్నాము.సిద్దిపేట నియోజకవర్గం లోనే మొదటి వడ్ల కొనుగోలు కేంద్రం పాలమాకుల గ్రామం లో ఏర్పాటు చేసుకున్నాం. 15 ఏళ్లుగా వడ్ల కొనుగోలు కేంద్రం పాలమాకుల గ్రామం నుండే ప్రారంభిస్తున్న వడ్ల, మక్కలు కొనుగోలు కేంద్రం నాలుగు ఊర్లు అమ్ముకొనే విధంగా గ్రామం ఉపయోగ పడుతుందని చెప్పారు. పాలమాకుల గ్రామం మీదుగా ఫోర్ లైన్స్ రోడ్డు చేసుకున్నము రెండు మూడు రోజుల్లో లైట్స్ కూడా ఏర్పాటు చేసుకుంటాం.పాలమాకుల మీదుగా రింగ్ రోడ్డు నిర్మాణం చేసుకొని నలుదిక్కుల రోడ్లు ఏర్పాటు చేసుకున్నామన్నారు.కెసిఆర్ ప్రభుత్వం 200 ఉన్న పెన్షన్ ను 2వేలు చేసాడు, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం 4వేలు ఇస్తా అని మాట తప్పిందని చెప్పారు.మహిళలకు ఇస్తా అన్న 2500 ఏగొట్టిందని మండిపడ్డారు.యాదవులకు స్థలం ఇప్పించి బోర్ మోటార్ కూడ ఏర్పాటు చేసిన యాదవుల కమ్యూనిటీ కి 5లక్షలు ఇచ్చానని గుర్తు చేశారు.గ్రామం లో బాలవికాస వాటర్ ప్లాంట్ నియోజకవర్గం లోనే మొట్టమొదలు ప్రారంభం చేసుకున్నాం.. నా స్వంత ఖర్చు లతో వాటర్ క్యాన్స్ ఇప్పించాను, ఉపాధి కూలీలకి వాటర్ బాటిల్స్, టిఫిన్ బాక్స్ లు ఇచ్చాను, ఊరు ఊరికి లైట్స్ ఇచ్చానని చెప్పారు.. ఇలా ఎల్లపుడు ప్రజల శ్రేయస్సు కు నా శక్తి వంచన లేకుండా పని చేస్తున్నాను.. ఎల్లప్పుడూ మీ సేవలో ఉంటానని. శ్రీ కృష్ణ స్వామి ఆశీస్సులతో అన్నింటా మంచి జరగాలని కోరుకుంటున్నా అన్నారు.ఈ కార్యక్రమంలో యాదవ కుల బంధువులతో పాటు మాజీ జెడ్పిటిసి రాగుల సారయ్య, మాజీ సర్పంచ్ రవీందర్ రెడ్డి, దువ్వల మల్లయ్య, రాంపూర్ మాజీ సర్పంచ్ రాజు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# రజక కుటుంబాలపైదాడిని బిఎస్పి తీవ్రంగా ఖండిస్తుంది

**అక్షర కలం/భద్రాచలం**



కుల అహంకారంతో దాడులు జరిపి పాప మరణానికి కారకులైన శ్రీనివాస్ రెడ్డిముత్తాపైకఠినమైనచర్యలుతీసుకోవాలిఆదిపత్యకుల భావజాలం కలిగిన పార్టీలకు పదేపదే అధికారం ఇస్తే బహుజనులపై జరిగేఅమానుష ఘటనలకు నిలువెత్తు సాక్ష్యంమే ఈ దాడిబహుజన రాజ్యం ఏర్పడితేనే బహుజన బిడ్డలకు రక్షణ ఉంటుంది నాగర్ కర్నూల్ మల్లన్న జాతరలో జరిగిన గొడవలో కులం అహంకార ధోరణిగల రెడ్లు రజక కుటుంబానికి చెందిన ఒక కుటుంబం పై దాడి చేసారు ఆ దాడి కారణంగా రెండు నెలల పాప మరణించింది కుల అహంకారంతో రెడ్లు రజకులపై జరిపిన ఈ అమానుష దాడిని బిఎస్పి తీవ్రంగా ఖండిస్తుందని బీఎస్పీ భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గం అధ్యక్షులు కొండా చరణ్ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు ఈ ఘటనలో పాలుపంచుకున్న అందరిని రిమాండ్ చేయాలని కుల అహంకారంతో దాడి చేసి పాప మరణానికి కారణమైన శ్రీనివాసరెడ్డి ముత్తాపై మర్డర్ కేసు నమోదు చేసి కఠినమైన శిక్షలు విధించాలని ప్రభుత్వాన్నిడిమాండ్చేశారుబాధితులకు అండగా ఉండాల్సిన పోలీస్ యంత్రాంగంరెడ్లకుఅనుకూలంగా ఉండటం దుర్మార్గమనిమండిపడ్డారు రాజకీయ ఒత్తిళ్లకు తలవంచి ఘటనకు ఘటనకు కారణమైన నిందితులను ఏ ఒక్కరిని కూడా తప్పించే ప్రయత్నం చేయడానికి వీలులేదని కేసును నీరు గారిచే పని చేస్తే బహుజన సమాజం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు రేవంత్ రెడ్డి ఈ ఘటనపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు ఆదిపత్యకుల భావజాలం కలిగిన పార్టీలకు పదేపదే అధికారం ఇస్తే బహుజనులపై జరిగే అమానుష దాడులకు నిలువెత్తు సాక్ష్యం ఈ నాగర్ కర్నూల్ లో రజకులపై జరిగిన దాడి అని తెలిపారు ఇప్పటికైనా బహుజన సమాజం మేల్కొనాలని ఈ ఘటనలు రజకులతో ఆగేవి కాదని మిగిలిన బహుజన కులాల దాకా తప్పకుండా వస్తుందని అన్నారు బహుజన బిడ్డల రక్షణ కోసం బహుజన రాజ్యం ఏర్పాటు కోసం ఐక్యంగా ఉద్యమించాలని యావత్తుబహుజన సమాజానికి పిలుపునిచ్చారు.

# భగవంతుని కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి

## సిద్దిపేట కాంగ్రెస్ ఇంచార్జ్ పూజాల హరికృష్ణ

**అక్షర కలం సిద్దిపేట ఫిబ్రవరి 22:**

సిద్దిపేట నియోజకవర్గం నుండి నంగునూరు మండలం పాలమకుల గ్రామంలో యాదవ కుల బంధువుల ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ యాదవ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆహ్వానము మేరకు కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా ఇన్చార్జి పూజాల హరి కృష్ణ శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ట



కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. కాంగ్రెస్ నాయకులు పూజల హరికృష్ణను శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందించడం జరిగింది. అనంతరంకాంగ్రెస్ పార్టీ సిద్దిపేట ఇంచార్జ్ పూజల హరికృష్ణ మాట్లాడుతూ ఈ దైవ కార్యములో పాల్గొనడం నాకు చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రజలందరూ ఎప్పుడు సుఖసంతోషాలతో ఉండాలని ఆ శ్రీకృష్ణుని వేడుకుంటున్నానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పూజల గోపికృష్ణ, బొమ్మల యాదగిరి, గ్రామ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నగరం నడిబొడ్డున 10 కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలానికి ఎసరు పెట్టిన భూ కబ్జాదారులు....

## సిపిఎం పార్టీ ఆందోళనతో స్పందించిన అధికారులు...



**అక్షర కలం/ ఖమ్మం నగరం:**

ఎన్ ఎస్ టి రోడ్, సిపిఎం పార్టీ జిల్లా కార్యాలయం వెనుక భాగంలో జిల్లా కోర్టు ఉద్యోగులకు కేటాయించిన భూమిలో... రెండు వేల గజాల స్థలం చూట్టూ అక్రమంగా కబ్జాదారులు కట్టిన ఫెన్సింగ్ గోడ కూల్చివేత....ఇది ప్రభుత్వ భూమి అని బోర్డు పెట్టిన అధికారులు..కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా మంత్రులు, అధికారులు చర్యలు తీసుకోవాలి – సిపిఎం పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ డిమాండ్ చేశారు.

# మహిళల రక్షణ, భద్రత కోసమే షీటీంలు

**ఎల్లారెడ్డి,ఫిబ్రవరి -22 (అక్షర కలం ):**



మహిళ రక్షణకు భద్రత కోసమే షీ టీంలు పనిచేస్తున్నయని షీటీం కళాబృందం సభ్యులు అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, షీటీ కళాబృందం ఆధ్వర్యంలో పట్టణంలోని వికెవి ఫంక్షన్ హల్ లో షీటీంలపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీం సభ్యులు మాట్లాడుతూ.. మహిళల భద్రత, ఆన్లైన్ మోసాలపై,ఇంస్టాగ్రామ్, ఫేస్ బుక్, 100 డయాల్ కాల్, యాంటీ డ్రగ్స్ పై అవగాహన కల్పించారు. మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ ,ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీటీం నిరంతరంగా మఫ్టీలో ఉంచడం జరుగుతుందని , ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 100 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు ,లోన్ యాప్స్ గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని, ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని, అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్ కు డయల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కళాబృందం, షీటీం సభ్యులు రామచంద్ర తిరుపతి, సాయిలు, శ్రీశైలం, సుప్రజా, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ముదిరాజులకు స్ఫూర్తిగా నిలుస్తున్న స్వామి లక్ష్మణ్ లు సింగర్ స్వామి, పోలీస్ లక్ష్మణ్ లను సన్మానించిన మండల ముదిరాజులు



**అక్షర కలం సిద్దిపేట ఫిబ్రవరి 22:**

ముదిరాజులు అన్ని రంగాలలో విద్యా ఉద్యోగం గానం రచయితలుగా రాజకీయ నాయకులుజి వారి వారి లక్ష్యాలకు అనుగుణంగా ప్రతిభవంతులు కావాలని ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. చిన్నకోడూరు గ్రామానికి చెందిన ఇట్టబోయిన స్వామి ముదిరాజ్ గుజారి గుజారి అనే జానపద గీతానికి ఐదు మిలియన్ల వ్యూస్ రావడంతో రచయితగా గాయకునిగా అవార్డు రాగా ఏఆర్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న దయ్యాల లక్ష్మణ్ పోలీస్ స్పోర్ట్స్ మీట్ బాడీ బిల్డర్ స్టేట్ సెకండ్ రావడంతో అతను కూడా అవార్డు తీసుకున్న సందర్భంగా చిన్నకోడూరు మండల ముదిరాజ్ నాయకులు శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడికాయల వెంకటేశంముదిరాజ్, సర్పంచ్ ఇట్టబోయిన శ్రీనివాసులు మాట్లాడుతూ ముదిరాజులు సమాజంలోనే వెనుకబడి ఉన్నారని ఇప్పుడిప్పుడే విద్యావంతులుగా ఎదుగుతూ అనేక రంగాలలో ముందుకు వెళ్తున్నారని అన్నారు. ఆర్థికంగా ఎదగాలంటే విద్య తప్పనిసరని విద్యను నిర్లక్ష్యం చేయొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్,, మేడికాయల వెంకటేశం, ఇట్టబోయిన శ్రీనివాస్, దూలం ముత్యం, పెండెల బాలయ్య, యాట రాజేష్, పడిగే లింగం, రాగి నాగరాజు, తుమ్మల తిరుపతి, పుప్పల బాలేష్, రేగుల కిషన్ ఉన్నారు.

## హమాలి జనరల్ బాడీ సమావేశం

**రక్షణ లేని హమాలి జీవితాలు**

**ప్రమాద బీమా ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలి**

**గోమాస ప్రకాష్ హమాలి సంఘం సిఐటియు జిల్లా అధ్యక్షులు**



**మందమర్రి/ చెన్నూరు ఫిబ్రవరి 22 అక్షర కలం ప్రతినిధి:-**

మందమర్రి మండలం సారంగపల్లి గ్రామం లో హమాలీల జనరల్ బాడీ సమావేశం కామ్రేడ్ శెట్టి శంకరయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో కామ్రేడ్ గోమాస ప్రకాష్ హమాలి సంఘం జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు. ఆయన ఈ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న అన్ని రకాల హమాలీల రక్షణకై సమగ్ర చట్టం చేయాలని, ప్రమాద బీమా పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు, పెన్షన్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షు లుగా కామ్రేడ్ గోమాస ప్రకాష్, అధ్యక్షులుగా శట్టి శంకరయ్య, ప్రధాన కార్యదర్శిగా గోలెం మల్లేష్, కోశాధికారిగా పెద్దపెల్లి వెంకటేశం, ఉపాధ్యక్షులుగా వై. రవీందర్, సహాయ కార్యద ర్శిగా పెంట రమేష్, కమిటీ సభ్యులుగా పెద్దపల్లి ఓదెలు, మామిడాల వెంకటేష్ ల ఎన్నుకున్నారు.

## రేవంత్ రెడ్డి పాలనలో బహుజనులకు రక్షణ కరువు!

**బీసీ పసి బిడ్డ ప్రాణాలు తీసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలి!**

**బీఎస్పీ నారాయణ పేట జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్!**

**(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, ఫిబ్రవరి,22)**

ఇందిరమ్మ రాజ్యం పేరుతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో బహుజనుల ప్రాణాలకు రక్షణ లేదని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్ విమర్శించారు. ఆదివారం ధన్వాడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో మూడు నెలల బీసీ చాకలి బిడ్డ ప్రాణాలు బలిగొన్న ఆధిపత్య వర్గాల వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని పాలించడం రేవంత్ రెడ్డికి చేతకాకుంటే తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. హోమ్ శాఖను తన వద్దే పెట్టుకొని పాలన సాగిస్తున్న రేవంత్ రెడ్డికి రాష్ట్రంలో బహుజన కులాల వ్యక్తులపై దాడులు, దౌర్జన్యాలు జరుగుతుంటే ఏం చేస్తున్నాడని ప్రశ్నించారు. బాధిత కుటుంబానికి ప్రత్యేక ఆర్థిక సహాయం చేసి రక్షణ కల్పించాలన్నారు. రాబోయే రోజుల్లో బహుజన సమాజం ఏకమై దొరల పాలనను అంతమొందించడం ఖాయమన్నారు.



# తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 15% నిధులు కేటాయించాలి.

**ప్రభుత్వం విద్య ను బలోపేతం చేయడానికి విద్య బడ్జెట్ నిధులు పెంచాలి**

**పేద,మధ్యతరగతి పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలి**

**బడుగుల సైదులు సామాజిక ఆర్థిక విశ్లేషకులు కోదాడ**

**కోదాడ : ఫిబ్రవరి 22 (అక్షర కలం)**



తెలంగాణలో ప్రభుత్వ విద్యను పునర్జీవింప చేయడానికి రాష్ట్ర బడ్జెట్ 2026 -27 లో విద్యకు 15% నిధులు కేటాయించాలని సామాజిక ఆర్థిక విశ్లేషకులు బడుగుల సైదులు ఆదివారం నాడు పత్రికా ప్రకటన ద్వారా ప్రభుత్వాన్ని కోరారు . రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందు, రాష్ట్ర కే బినెట్ మంత్రులు సమావేశంలో విద్యా బడ్జెట్ నిధుల పెంచడం పైన దృష్టి పెట్టాలన్నారు. విద్యకు కేటాయించే బడ్జెట్ విషయంలో తెలంగాణ దేశంలోనే అట్టడుగు స్థానంలో ఉంటున్నది. 2014 -15లో 10.89 శాతం గా ఉన్న విద్యా బడ్జెట్ 2024 -25 నాటికి 7.5 శాతానికి పడిపోయింది . ఇది కొఠారి కమిషన్ సూచించిన 20% , జాతీయ సగటు 15%తో పోలిస్తే చాలా తక్కువ. బడ్జెట్ తగ్గిన కొద్ది ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతులు, ఉపాధ్యాయ నియామకాలు ,విద్య నాణ్యత ప్రభావితం అవుతాయి. విద్యా ప్రాధాన్యతను గుర్తించిన పేద, మధ్యతరగతి కుటుంబాలు తమ పిల్లలను నాణ్యమైన విద్య కోసమని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదివించడం వల్ల తల్లిదండ్రులకు అధిక ఫీజులతో విద్యాబారం పెరుగుతున్నది. బాలలందరికీ సమానమైన నాణ్యమైన కార్పోరేట్ స్థాయి విద్యను అందించడానికి, విద్యా బడ్జెట్ పై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. సంక్షేమ పథకాలతో పాటు ప్రభుత్వ నిధులతో కూడిన సమాన, నాణ్యమైన సారత్రిక విద్య ద్వారా మాత్రమే సమాజంలో అసమానతలను తగ్గించగలుగుతాము, అరకొర నిధులతో ప్రభుత్వం విద్యను నిర్లక్ష్యం చేసినప్పుడు లేదా ప్రైవేటీకరించినప్పుడు అసమానతలు పెరుగుతాయి. పేద మధ్యతరగతి కుటుంబాలపై విద్యా ఖర్చుల భారం పెరుగుతుంది. రాష్ట్రంలో ఇప్పటికే అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ పాఠశాల మౌలిక వసతులు సదుపాయాలు పూర్తి చేయడానికి, పెండింగ్ బిల్లులు చెల్లింపులు , రియంబర్స్మెంట్ బకాయిలు ,మిస్ చార్జీలు పెంపకం, రిటైర్మెంట్ ఉద్యోగుల బెనిఫిట్స్ చెల్లింపులు, ప్రపంచ స్థాయి ప్రమాణాలతో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలల ఏర్పాటు ,నియోజకవర్గస్థాయిలో అంబేద్కర్ నాలెడ్జి సెంటర్ల ఏర్పాటు తోపాటు, 2047 రైజింగ్ తెలంగాణ లక్ష్యసాధన విద్యా బడ్జెట్ పెంపుదల తోటే సాధ్యం. తెలంగాణ రాష్ట్రంలో విద్యాహక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయడానికి, సమాజంలో అంతరాలు లేకుండా అందరికీ సమానమైన నాణ్యమైన విలువలతో కూడిన విద్యను అందించడానికి రాష్ట్ర బడ్జెట్లో విద్యకు కనీసం 15 శాతం నిధులు కేటాయించాలని కోరారు.

# ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను చేపట్టాలి......

**రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**ఏదులాపురం మున్సిపాలిటీనీ ఆదర్శంగా తీర్చిదిద్దాలి**

**ఏదులాపురం మున్సిపల్ పాలకవర్గం సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న**

**మంత్రి పొంగులేటి**







**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదివారం ఏదులాపురం మున్సిపాలిటీలో నూతనంగా ఎన్నికైన పాలకవర్గం, మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్ లకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఏదులాపురం మున్సిపాలిటీ కి నూతనంగా చైర్ పర్సన్ గా ఎంపికైన అనిత, వైస్ చైర్మన్ నవీన్, నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ లకు అభినందనలు తెలిపారు. ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ముగిసిందని, ఎన్నికల వరకే రాజకీయాలు ఉంటాయని, ఎన్నికల తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, అభివృద్ధి కార్యక్రమాలపై మాత్రమే దృష్టి సారించాలని అన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ చాలా విశాలంగా ఉంటుందని, ఇక్కడ ఓపెన్ ప్లేస్ చాలా ఉన్నదని, అనేక మౌళిక వసతుల కల్పన అవసరం ఉందని అన్నారు. రాష్ట్రంలో ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా ఏదులాపురంను అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. ప్రతి కౌన్సిలర్ రోజు ఉదయం వార్డు పరిధిలో పర్యటిస్తూ జరిగే పారిశుద్ధ్య పనులను, అభివృద్ధి పనులు పర్యవేక్షించాలని మంత్రి సూచించారు. ప్రతి పని డబ్బుతోనే జరగదని మన పని తీరు ఆధారంగా అనేక మంచి కార్యక్రమాలు అమలు చేయవచ్చని తెలిపారు. వారానికి కనీసం ఐదు రోజులు రెండు గంటల పాటు వార్డులో సమయం గడపాలని అన్నారు. 15 రోజులలో మరొక సమావేశం నిర్వహించి విడతల వారీగా ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టాలి అనే అంశంపై సమావేశం నిర్వహిస్తామని అన్నారు. మున్సిపాలిటీలో క్షేత్రస్థాయి పర్యటనలు ఓపెన్ ప్లాట్లలో నీరు నిలవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడడం గమనించామని, నాలాల ఆక్రమణల తొలగింపు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజా జీవితంలో మనకు వచ్చిన అవకాశాన్ని పేదలకు మంచి చేసేందుకు వినియోగించాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాధ బాబు, ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ఏదులాపురం మున్సిపల్ కమీషనర్ మునవర్ అలీ, మునిసిపల్ కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు..



## నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో జరిగిన కుల అహంకార చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. ;

**పి వై ఎల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రతాప్ సిద్దు ;**

(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, ఫిబ్రవరి,22)

నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో జరిగిన కుల అహంకార చర్యలకు పాల్పడిన నిందితులను వెంటనే శిక్షించాలని నారాయణపేట జిల్లా జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జరిగింది. ఈ సందర్భంగా పి వై ఎల్ జిల్లా అధ్యక్షులు కార్యదర్శులు, ప్రతాప్ సిద్దు జిల్లా కార్యాలయంలో,మాట్లాడుతూ టికెట్ లేకుండా గుడిలోకి ప్రవేశించిన కారణం గా చాకలి కులస్తులు ఐన గణేష్, చంద్రకళ, మౌనిక ల పై అదే గ్రామ సర్పంచ్ తుకారాం రెడ్డి, సతీష్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి,మధు రెడ్డి ఈ రెడ్డి వర్గం అంతా...రాయలేని భాష తో బూతులు తిడుతూ.. దురహంకారంతో అతి కిరాతకంగా భయంకరంగా వారిపై దాడి చేశారు, మరియు రెండు నెలల పసిబిడ్డని కాలు తో తన్ని చంపారు. ఈ రెడ్డిల దురహంకార సంఘటన ను ప్రగతిశీల యువజన సంఘం తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. అంతే కాకుండా నిందితులను వెంటనే అరెస్టు చేసి వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. అట్లాగే నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ, కలెక్టర్ వెంటనే బాధితులకు భద్రత కల్పించి వారికి తగు నష్టపరిహారం చెల్లించడమే కాకుండా వారికి వైద్య చికిత్సలు అందేలాగా చేయాలని అన్నారు. ఈసంఘటన ముఖ్యమంత్రి జిల్లాలో జరిగి నాలుగు రోజులైనా నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోగా, తిరిగి బాధిత కుటుంబం పై కేసులు పెట్టి, అగ్రవర్ణాలకు కొమ్ముకాస్తున్న పోలీసు వ్యవస్థ చర్యలు దుర్మార్గమైనవి. బాధ్యత రహితంగా వ్యవహరించిన స్థానిక పోలీస్ స్టేషన్లో బాధ్యతలు నిర్వహిస్తున్న సంబంధిత పోలీసు అధికారిని కూడా తక్షణమే విధుల నుంచి తొలగించాలని అంతే కాకుండా వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి అయినా రేవంత్ రెడ్డి దీనిలో జోక్యం చేసుకొని నిందితులను వెంటనే శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.



అక్షరకలం APTELRNI No. 2009/27246

# బొగ్గుల శ్రీనివాస్ హత్య కేసును ఛేదించిన కూసుమంచి పోలీసులు





అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

రచయిత, యూ ట్యూబర్ బొగ్గుల శ్రీనివాస్ హత్య కేసును ఖమ్మం జిల్లా కూసుమంచి పోలీసులు ఛేదించారు. శ్రీనివాస్ హత్యకు దారి తీసిన పరిస్థితులను, పరిణామాలను ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి ఆదివారం మీడియాకు వెల్లడించారు. ఆర్థిక లావాదేవీల వివాదమే శ్రీనివాస్ దారుణ హత్యకు దారి తీసినట్లు చెప్పారు. అశ్వరావుపేటకు చెందిన సుపారీ ముఠా శ్రీనివాస్ ను కత్తులతో పొడిచి, ఇనుపరాడ్లతో కొట్టి చంపినట్లు ఏసీపీ తెలిపారు. ఈ హత్యోదంతానికి, పవన్ కళ్యాణ్ పై శ్రీనివాస్ రాసిన పుస్తకానికి ఎటువంటి సంబంధం లేదన్నారు. ఏసీపి తిరుపతిరెడ్డి కథనం ప్రకారం.. బొగ్గుల శ్రీనివాస్ హత్యకు దారి తీసిన పూర్తి వివరాల్లోకి వెడితే..బొగ్గుల శ్రీనివాస్ హైదరాబాద్ లో నివసిస్తూ యూ ట్యూబర్ గా, రచయితగా ప్రాచుర్యం పొందాడు. యూ ట్యూబ్, ఇన్ స్టా గ్రామ్ లలో వీడియోలు చేస్తుండేవాడు. శ్రీనివాస్ తో పాటు మేకల వేణుమాధవ్ రెడ్డి అనే వ్యక్తి సిల్వర్ జూబ్లీ కాలేజీలో చదువుకున్నారు. కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి హాజరైన సందర్భంలో ఒకరికొకరు పరిచయం అయ్యారు. బొగ్గుల శ్రీనివాస్ కు దీూ++ఖూూ దీదీూ పేరుతో +ూ లైసెన్స్ ఉండగా, వేణుమాధవ్ రెడ్డి 'మేకా ప్రాజెక్ట్స్' పేరుతో ఓ కంపెనీని స్థాపించి సబ్ కాంట్రాక్టర్ గా పనిచేస్తున్నాడు.బొగ్గుల శ్రీనివాస్ హైదరాబాద్ లో నివసిస్తూ యూ ట్యూబర్ గా, రచయితగా ప్రాచుర్యం పొందాడు. యూ ట్యూబ్, ఇన్ స్టా గ్రామ్ లలో వీడియోలు చేస్తుండేవాడు. శ్రీనివాస్ తో పాటు మేకల వేణుమాధవ్ రెడ్డి అనే వ్యక్తి సిల్వర్ జూబ్లీ కాలేజీలో చదువుకున్నారు. కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి హాజరైన సందర్భంలో ఒకరికొకరు పరిచయం అయ్యారు. బొగ్గుల శ్రీనివాస్ కు దీూ++ఖూూ దీదీూ పేరుతో +ూ లైసెన్స్ ఉండగా, వేణుమాధవ్ రెడ్డి 'మేకా ప్రాజెక్ట్స్' పేరుతో ఓ కంపెనీని స్థాపించి సబ్ కాంట్రాక్టర్ గా పనిచేస్తున్నాడు.అయితే ఇందుకు రూ. కోటి పైనే జీఎస్టీ జరిమానా చెల్లించాల్సిన పరిస్థితుల కారణంగా శ్రీనివాస్, వేణుమాధవ్ రెడ్డిల మధ్య తీవ్ర విభేదాలు, వివాదాలు తలెత్తాయి. ఆర్థిక ఒత్తిడికి దీూ++ఖూూ దీదీూ కంపెనీ జీఎస్టీ లైసెన్స్ తిరిగి యాక్టివేట్ చేయించడం, కోటి రూపాయల జరిమానా భారం తదితర అంశాలు తోడవడంతో వేణుమాధవ్ రెడ్డి మదిలో హత్య యోచన మెదిలింది. ఈమేరకు కుట్ర పన్నిన వేణుమాధవ్ రెడ్డి అశ్వారావుపేటకు చెందిన పోకల కోటేశ్వర్ రావును, షేక్ అబ్దుల్ హఫీజ్ ను, మహ్మద్ అజ్మత్ ఆలీ ఖాన్ తో కలిసి శ్రీనివాస్ హత్యకు కుట్ర పన్నాడు.కుట్ర అమలులో భాగంగా పోకల వెంకటేశ్వర్ రావు, అబ్దుల్ హఫీజ్, ఆజ్మత్ ఆలీఖాన్ ముఠాకు రూ. 5.00 లక్షల మొత్తాన్ని వేణుమాధవ్ రెడ్డి సుపారీగా చెల్లించాడు. చెల్లించాల్సిన డబ్బును ఇస్తామంటూ ఈనెల 13వ తేదీన రాత్రి శ్రీనివాస్ ను ఆయా ముఠాతోపాటు వేణుమాధవ్ రెడ్డి నమ్మించారు. డబ్బుకోసం విజయవాడకు వెడదామని చెప్పి శ్రీనివాస్ ను కారులో తీసుకువెళ్లారు. ఆ మరుసటి రోజు 14వ తేదీన తెల్లవారుజామున నకిరేకల్ నుంచి జనగామ వైపునకు వెళ్లే దారిలో నిర్మానుష్య ప్రదేశంలో నిందితులు కత్తులు, ఐరన్ రాడ్లతో శ్రీనివాస్ తలపై కొట్టి, పొడిచి దారుణంగా హత్య చేశారు.శ్రీనివాస్ ను ఈ విధంగా చంపిన తర్వాత రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు పథకరచన చేశారు. ఇందులో భాగంగానే మృతదేహాన్ని కారులో తీసుకుని పాలేరు రిజర్వాయర్ లోకి పడేసి, అదుపుతప్పిన కారు ప్రమాద ఘటనగా నమ్మించేయత్నం చేశారు. అయితే మొత్తం ఘటనలో ట్విస్ట్ ఏమిటంటే.. కారును రిజర్వాయర్ లోకి తోసేసి ప్రమాదంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించిన సుపారీ ముఠా మాత్రం పోలీసుల దర్యాప్తు నుంచి తప్పించుకోలేకపోవడం.కాగా ఈ కేసును విజయవంతంగా దర్యాప్తు జరిపిన కూసుమంచి సీఐ సంజీవ్, కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం ఎస్ఐలు నాగరాజు, సంతోష్, జగదీష్, ప్రొబేషనరీ ఎస్ఐ దివ్యలను ఏసీపీ తిరుపతిరెడ్డి అభినందించారు. అదేవిధంగా ఈ కేసులో సహకరించిన శ్రీకాంత్, సతీష్, వినయ్, ఉదయ్, పూర్ణ చందర్ రావు, శ్రీశైలం, శ్రీలత, సయ్యద్, శోభన్, సీతారాములు, హోంగార్డు రాంబాబును ఏసీపీ ప్రశంసించారు. నాలుగు టీంలుగా దర్యాప్తును విజయవంతంగా పూర్తిచేసి, నిందితులను అరెస్ట్ చేసిన ఆయా అధికారులకు, సిబ్బందికి రివార్డులను కూడా ఏసీపీ అందించారు.

# ఎంపీ వద్దిరాజు స్వర్గీయ రాఘవేందర్ రెడ్డికి ఘన నివాళులు

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర స్వర్గీయ వెన్నం రాఘవేందర్ రెడ్డికి ఘనంగా నివాళులర్పించారు.బిగ్ టీవీ ఛానెల్ యజమాని విజయ్ కాంత్ రెడ్డి తండ్రి రాఘవేందర్ రెడ్డి ఈనెల 11వతేదీన దివంగతులు కాగా, ఆదివారం వారి స్వగ్రామం మహబూబాబాద్ జిల్లా కొత్త రెడ్యాల గ్రామంలో దశదిన కర్మకాండ జరిగింది.ఈ సందర్భంగా రాఘవేందర్ రెడ్డి చిత్రపటానికి ఎంపీ రవిచంద్ర పూలుజల్లి శ్రద్ధాంజలి ఘటించి,ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు.దివంగత రాఘవేందర్ రెడ్డి కుమారులు శ్రీకాంత్ రెడ్డి,విజయ్ కాంత్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.



# యూనియన్ల ప్రతిపాదన మేరకే అక్రిడేషన్ కమిటీలు

-వెబ్ సైట్ సమస్యలు పరిష్కరిస్తాం

-రామ్ నారాయణ కు హామీ ఇచ్చిన మంత్రి పొంగులేటి

-సమస్యలు పరిష్కరించాలని కోరిన టి యు డబ్ల్యు జే ఐ జే యు బృందం

-కేబుల్ చానల్స్, చిన్న పత్రికలకు కూడా అక్రిడేషన్లు కల్పించాలని విజ్ఞప్తి

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:





జర్నలిస్టు యూనియన్ల ప్రతిపాదన మేరకే అక్రిడేషన్ కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాలు, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం ఖమ్మంలోని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో జర్నలిస్టుల అక్రిడేషన్, వెబ్ సైట్, కేబుల్ చానల్స్, చిన్న పత్రికల సమస్యలపై మంత్రి పొంగులేటి కి టియుడబ్ల్యుజే ఐజేయు జర్నలిస్టు యూనియన్ నాయకుల బృందం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే రామ్ నారాయణ సారథ్యంలో ప్రత్యేకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోల రామ్ నారాయణ ఈ సందర్భంగా మంత్రికి అన్ని విభాగాల జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. రాష్ట్రంలో 44709 మంది జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు ఇస్తామని చెప్పారని, తమరు ఇచ్చిన జీవో ప్రకారం చూస్తే 50% కార్డులు కూడా రావనే గందరగోళం జర్నలిస్టుల్లో నెలకొందని పేర్కొన్నారు. ఫ్రీలాన్సర్, వెటరన్ జర్నలిస్టులకు పెట్టిన నిబంధనలు ఇబ్బందిగా ఉన్నాయని, వెబ్ సైట్ ఓపెన్ చేస్తే అందులో అడిగే ప్రశ్నలు కార్డులు ఇచ్చేలా లేవని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నట్లు మంత్రి దృష్టికి తెచ్చారు. వెబ్సైట్ ఫార్మేట్ సులభతరంగా లేదని ప్రస్తావించారు. జిల్లా అక్రిడేషన్ కమిటీలలో గత సాంప్రదాయం ప్రకారం రిజిస్టర్డ్ యూనియన్ నుంచి లెటర్ పంపితే కమిషనర్ కార్యాలయం ఆమోదించి వారిని కమిటీ లో సభ్యులుగా తీసుకున్నారని, ప్రస్తుతం దానిని పక్కన పెట్టి కలెక్టర్లకు అధికారం కల్పించడానినీ తప్పు పట్టారు. ఇది అత్యంత విచారకరమన్నారు. పాత పద్ధతినే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత జీవో ప్రకారం కలెక్టర్ అందరిని నామినేట్ చేస్తారనే ఉందని , ఇది సాధ్యం కాదని, కలెక్టర్కు కొత్త చిక్కులు తెచ్చి పెడుతుందని పేర్కొన్నారు. మా విన్నపాన్ని పరిశీలించి గతంలో అక్రిడేషన్ కమిటీలు ఏ విధంగా ఏర్పాటు చేశారో అదే సాంప్రదాయాన్ని కొనసాగించాలని రామ్ నారాయణ మంత్రిని కోరారు. జీవో ప్రకారం పెద్ద పత్రికలు, శాటిలైట్ చానల్స్, డెస్క్ జర్నలిస్టుల కార్డులు తగ్గించడం జరిగిందని, దీంతో ఇబ్బందులు తప్పవనే ఆందోళనతో జర్నలిస్టులు ఉన్నారని పేర్కొన్నారు. చిన్న పత్రికల వారు కూడా తమకు గతంలో మాదిరిగా కార్డులు రావని ఆందోళనలో ఉన్నారని, కేబుల్ చానల్స్ జర్నలిస్టులకు అన్యాయమే జరుగుతుందని వివరించారు. గతంలో వారు కార్డులు పొందినప్పటికీ , ఈసారి కార్డులు రావని ఆందోళన చెందుతున్నారని 20 నిమిషాల పాటు అన్ని అంశాలపై మంత్రికి వివరించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. యూనియన్ల ప్రతిపాదన మేరకే అక్రిడేషన్ కమిటీలు ఏర్పాటు చేస్తామని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు. అక్రిడేషన్ వెబ్ సైట్ ను సరళీకరణ చేస్తామన్నారు. అక్రిడేషన్ల గడువు మరో నెల పొడిగింపు జరుగుతుందని, జర్నలిస్టులు, సంఘాల నాయకులు ఆందోళన చెందరాదన్నారు. అర్హులందరికీ అక్రిడేషన్ కార్డులు ఇస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. మంత్రిని కలిసిన వారిలో టీయూడబ్ల్యూజే ఐజేయు జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు మాటేటి వేణుగోపాల్, మాజీ జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు, యూనియన్ జిల్లా కార్యదర్శి మైస పాపారావు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు మామిడాల భూపాల్, జర్నలిస్టుల జిల్లా హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు మోయినుద్దీన్, జిల్లా కోశాధికారి నాగండ్ల శివ, ఖమ్మం నగర కమిటీ అధ్యక్ష కార్యదర్శులు చెరుకుపల్లి శ్రీనివాస్, నంచర్ల జనార్ధన చారి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వేగినాటి మాధవరావు, జిల్లా నాయకులు ఏలూరు వేణుగోపాలరావు తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువును ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు మీదే...కొత్తపల్లి రాజేందర్ రెడ్డి ;

(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, ఫిబ్రవరి,22)




10వ తరగతి విద్యార్థులు చదువును కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడానికి అవకాశం ఉంటుందని గౌతమ్ మోడల్ హై స్కూల్ కరస్పాండెంట్ కొత్తపల్లి రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం పాఠశాలలో అన్యువల్ డే కల్చరల్ ఫెస్ట్ (2026) కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి రాజేందర్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు బంగారు భవిష్యత్ నిర్మించుకోవడానికి చదువు మాత్రమే దోహదపడుతుందని తెలిపారు. ప్రపంచంలో అత్యంత ఉన్నతమైన ఆయుధం చదువు అని కొనియాడారు. పాఠశాల స్థాయి నుండే భవిష్యత్తులో ఏ రంగంలో రాణించడానికైనా పదవ తరగతి విద్య పునాదిగా ఉంటుందని అన్నారు. తమ పాఠశాలలో తల్లిదండ్రులు లేని పిల్లలకు ఫీజులో 50% రాయితీ కల్పించడం జరుగుతుందని తెలిపారు. అలాగే మిగిలిన 50% రాయితీని సూర్యచంద్ర ఫౌండేషన్ అధినేత ఎస్.సూర్యమోహన్ రెడ్డి 50% రాయితీని ఫౌండేషన్ తరపున తల్లిదండ్రులు లేని పిల్లలకు అందించడానికి ముందుకు రావడం వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తల్లిదండ్రులు లేని విద్యార్థులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు, అతిథులకు భోజన సౌకర్యం కల్పించారు. అనంతరం పాఠశాలకు వచ్చిన ముఖ్య అతిథులకు శాలువాలతో సన్మానించి మిమెంటోలు అందజేశారు. అదేవిధంగా ప్లాస్టిక్ నివారణ దిశగా ప్రజలందరూ అవగాహన పరిచే విధంగా పాఠశాల పేరుతో తయారు చేయించిన కొబ్బరిపీచు బ్యాగులను వచ్చిన ప్రతి ఒక్కరికి అందించారు. విద్యార్థుల పర్ఫామెన్స్ చూసిన మండల ప్రజలు,విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల పర్ఫామెన్స్ చూస్తుంటే "నెవర్ బిఫోర్ నెవర్ ఆఫ్టర్"అనే విధంగా చక్కగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ విషయమే కస్పాండెంట్ కొత్తపల్లి రాజేందర్ రెడ్డి తమ ఆహ్వానాన్ని మన్నించి తమ విలువైన సమయాన్ని ఈ కార్యక్రమానికి అందించిన పెద్దలకు, విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులకు, పుర ప్రముఖులకు, ఇంత పెద్ద కార్యక్రమం విజయవంతం కావడంలో కీలకమైన పాఠశాల సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాధిక, ముఖ్య సలహాదారులు ముక్తార్, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా లోని వివిధ ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్స్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పొంగులేటిని మర్యాదపూర్వకంగా కలిసిన సత్తుపల్లి, కల్లూరు మున్సిపల్ ప్రజాప్రతినిధులు

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

నూతనంగా ఎన్నికైన సత్తుపల్లి, కల్లూరు మున్సిపాలిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు ఆదివారం ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వారికి శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. ప్రజలు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి, పట్టణాల అభివృద్ధికి కట్టుబడి ఉండాలని ఈ సందర్భంగా మంత్రి వారికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ తదితరులు పాల్గొన్నారు.



# మృతుని కుటుంబానికి 5000-/రూపాయల ఆర్థిక సాయం.

## బిజెపి రాష్ట్ర నాయకులు మల్లెబోయిన డా.అంజి యాదవ్

అనంతగిరి : ఫిబ్రవరి 22(అక్షర కలం)

అనారోగ్యంతో మృతి చెందిన అనంతగిరి మండల గ్రామ కొండ్రు కోటయ్య కుటుంబానికి బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్. అంజి యాదవ్ 5000-/ రూపాయలను సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షులు మల్లె బోయిన వెంకటేష్ బాబు చేతుల మీదుగా మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో నకరికంటి సుందర్ రావు, కొండ్రు గోపయ్య, మారుతి కొండయ్య, హార్జన్ రావు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955